# నేటి నిజం

తెలుగు దినపత్రిక

E-mail : netinijam93@gmail.com website:www.netinijam.com

హైదరాబాద్ మంగళవారం 20-12-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:29 సంచిక:103 పేజీలు:6 వెల: రూ.1/-


## తవాంగ్ ఘటనపై చర్చకు నిరాకరణ: ప్రతిపక్షాలు వాకౌట్

న్యూఢిల్లీ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ వద్ద భారత్-చైనా సైనికుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలపై రాజ్యసభలో తీవ్ర దుమారం చెలరేగుతున్నది. సరిహద్దుల్లో ఘర్షణపై చర్చ చేపట్టాలని ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన తీర్మానాలను రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ తిరస్కరించారు. దాంతో కాంగ్రెస్ సభ్యులతోపాటు ఇతర ప్రతిపక్ష ఎంపీలు మూకుమ్మడిగా రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. చైనా మన భూభాగాన్ని ఆక్రమిస్తున్నది. కీలకమైన ఆ అంశంపై చర్చించకుండా సభలో ఇంకా ఏ అంశంపై మనం చర్చిస్తాం? తవాంగ్ ఘటనపై చర్చ జరపాల్సిందే అని డిమాండ్ చేశారు. అయినా, సభాపతి ధన్‌కర్ అందుకు ఒప్పుకోకపోవడంతో ప్రతిపక్ష సభ్యులంతా సభ నుంచి వాకౌట్ చేశారు. సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణపై చర్చ చేపట్టకపోతే ఊరుకునే సమస్యే లేదని ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి.

## 22 నుంచి బుక్ ఫెయిర్.. ఎన్టీఆర్ స్టేడియంలో 320 స్టాళ్లతో ఏర్పాటు..

హైదరాబాద్, డిసెంబర్ 19: దేశంలోని వివిధ రకాల సాహిత్యాన్ని ఏటా ఒకచోటుకు తెచ్చే హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన మరోసారి పుస్తక ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ నెల 22 నుంచి జనవరి ఒకటి వరకు 35వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఎన్టీఆర్ స్టేడియంలో జరగనుంది. కోవిడ్ దృష్ట్యా సందర్శకుల ఆదరణ పెద్దగా ఉండదన్న ఉద్దేశంతో నిర్వాహకులు గతేడాది 260 స్టాళ్లనే ఏర్పాటు చేసినప్పటికీ పుస్తక ప్రియులు భారీగా తరలిరావడంతో ప్రదర్శన విజయవంతమైంది. ఈ నేపథ్యంలో ఈసారి 320 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఉపాధ్యక్షుడు కోయ చంద్రమోహన్ తెలిపారు.

### అంచెలంచెలుగా..

నగరంలో నిజాంల కాలం నుంచే పుస్తకాలకు ఆదరణ ఉంది. అధికార భాష ఉర్దూతోపాటు తెలుగు, మరాఠీ, కన్నడ, హిందీ ఇంగ్లిష్ పుస్తకాలు చదివే ప్రజలు మొదటి నుంచీ ఇక్కడ ఉన్నారు. పాఠకుల అభిరుచికి తగిన విధంగానే పుస్తక ప్రచురణ సంస్థలు ఆవిర్భవించాయి. కోఠిలోని బడీచౌడీ పుస్తక బజార్‌గా వెలుగొందింది. అక్కడి పుస్తక విక్రేతలే హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు శ్రీకారం చుట్టారు.

దేశ వ్యాప్తంగా పుస్తక పఠనాన్ని పెంచే లక్ష్యంతో ఆవిర్భవించిన నేషనల్ బుక్ ట్రస్ట్ నగరంలోని పుస్తక ప్రచురణ సంస్థలు, విక్రయ సంస్థలతో కలసి 1986లో 'హైదరాబాద్ బుక్ ఫెయిర్'ను తొలిసారి కేశవ మెమోరియల్ స్కూల్ మైదానంలో ఏర్పాటు చేసింది. ఆ తరువాత నిజాం కళాశాల మైదానం, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం, నెక్లెస్‌రోడ్ తదితర ప్రాంతాల్లో పుస్తక ప్రదర్శనలు జరిగాయి.

కథలు, నవలలు, గల్పికలు, చరిత్ర గ్రంథాలదే పుస్తక ప్రదర్శనల తొలినాళ్లలో అగ్రస్థానం. సోవియెట్ సాహిత్యం కూడా పాఠకులను బాగా ప్రభావితం చేసింది. క్రమంగా ప్రముఖుల జీవిత చరిత్రలు, పంచతంత్ర వంటి పిల్లల పుస్తకాలు ఆదరణ పొందాయి. అలాగే యోగా, ఆయుర్వేద, హోమియో వైద్య పుస్తకాలు సైతం బాగా అమ్ముడవుతున్నాయి. ఇటీవల కాలంలో పోటీపరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్‌కు డిమాండ్ బాగా పెరిగింది. ఈ ఏడాది కూడా విభిన్న రంగాలకు చెందిన పుస్తకాలను ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఐపీసీ జాతీయ అధికార ప్రతినిధిగా చైతాలి విమల్ ధరంషి

హైదరాబాద్ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా మహారాష్ట్రలో మీడియా రంగంలో సేవలందిస్తున్న శ్రీమతి చైతలి విమల్ ధరంషి నియమితులయ్యారు ఈ సందర్భంగా ఐపీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి డబ్ల్యూ కృష్ణమూర్తి పత్రికా ప్రకటన లో పేర్కొంటూ శ్రీమతి ధరంషి గారు మీడియా రంగంలో సేవలందిస్తూ సంఘసేవలో చురుకుగా పాల్గొంటున్న సందర్భంగా ఐపిసి పార్టీ ఆమెను జాతియ అధికార ప్రతి నిధి హోదాతో గౌరవించి ఆహ్వానించినట్టు తెలిపారు ఈ సందర్భంగా శ్రీమతి ధరంషి గారు మాట్లాడుతూ ఐపీసీ పంచ సూత్రాలైన 1.మాతృ ప్రేమతో పరిపాలన 2.ప్రతి మనిషికి విద్య వైద్యం ఉచితం 3. భారతదేశ మొత్తం సంపూర్ణ మద్యపానం నిషేధం 4.మతసామరస్యాన్ని పాటిస్తూ గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించడం 5. మానవసేవే మాధవసేవ స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించడమే ముఖ్య ఉద్దేశంతో స్థాపించబడిన ఐపిసి కి ఆకర్షితురాలి నై ఐపీసీలో చేరినట్టు తెలిపారు తనకు అధికార ప్రతినిధి తో పాటు జాతీయ కార్యదర్శి హోదా కూడా ఇచ్చినందుకు ఐపీసీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ గారికి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి మారెప్ప గారికి ఉదయలక్ష్మి గారికి జాతీయ ప్రధాన కార్యదర్శులు యోగేష్ కతరపాల్ డబ్ల్యూ కృష్ణమూర్తి మరియు ఐపీసీ కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు ఐపిసి పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు

## బీఆర్ఎస్ రావాలి.. కేసీఆర్ ప్రధాని కావాలి : మంత్రి మల్లారెడ్డి

వనపర్తి, డిసెంబర్ 19: దేశంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని, సీఎం కేసీఆర్ ప్రధాని కావాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు అభివృద్ధి కావాలని, అబద్ధాలతో బీజేపీ ఎనిమిదన్నరేళ్లుగా దేశ ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. ఇంకో ఏడాదిన్నర అయితే బీజేపీ పీడ విరగడ అవుతుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి పథకాలు లేవని, జిల్లాకో మెడికల్ కళాశాల ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనతేనన్నారు.కేసీఆర్ కేంద్రంలో అధికారంలోకి వస్తే ఈ పథకాలన్ని దేశమంతటా అమలవుతాయన్నారు. దేశానికే తెలంగాణ ఆదర్శమన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో సీట్లు దొరకడం లేదని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం మన అదృష్టమన్నారు. ప్రతి నిమిషం ఆయన ప్రజల గురించే ఆలోచిస్తున్నాడన్నారు. మన పార్టీ బీఆర్ఎస్ అని, కాబోయే ప్రధాని కేసీఆర్ అన్న లక్ష్యం కార్యకర్తలు పని చేయాలన్నారు. వనపర్తి జిల్లా అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయానన్న మల్లారెడ్డి.. మంత్రి నిరంజన్‌రెడ్డి మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీలు తెచ్చారన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో వనపర్తి అభివృద్ధి ముందున్నదన్నారు.

### చరిత్రలో నేటినిజం




(డిసెంబర్ 20 సోమా సీతారాములు పుట్టిన రోజు...) –రాధశ్రీ సెల్:9494481210



## త్వరలో గర్భిణులకు కేసీఆర్ పోషకాహార కిట్లు : మంత్రి హరీష్‌రావు





హైదరాబాద్, డిసెంబర్ 19: గర్భిణిల ఆరోగ్యాన్ని దృష్టిలోపెట్టుకున్న తెలంగాణ ప్రభుత్వం త్వరలో గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందించనున్నట్లు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. గర్భిణిలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారని, తద్వారా ఆరోగ్యవంతమైన తెలంగాణను నిర్మించుకోవచ్చు నన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు గ్రామంలో హంస హోమియోపతి మెడికల్ కళాశాల 75 పడకల సంయుక్త బోధన దవాఖానను ప్రారంభించారు. అనంతరం ఆయన వైద్యులు, పురప్రముఖులను ఉద్దేశించిన ప్రసంగించారు.

ములుగులో హంస హోమియో మెడికల్ కాలేజీలో 75 పడకల బోధన దవాఖానను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉన్నదని హరీష్‌రావు చెప్పారు. ఆయుష్‌కు మంచి భవిష్యత్ ఉన్నదని, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో సాంప్రదాయ వైద్యానికి రోజు రోజుకు ప్రాధాన్యం పెరుగుతున్నదన్నారు. ఆయుర్వేదం, యోగ, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి.. దేనికవే ప్రత్యేకత కలిగి ఉన్నాయని చెప్పారు. తెలంగాణలో అందరికీ వైద్యం అందించే క్రమంలో కేసీఆర్ ఆలోచనల మేరకు బస్తీ పల్లె దవాఖానాలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పల్లె దవాఖానల్లో ఆయుష్ డాక్టర్లను కూడా రిక్రూట్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరించాలని కేంద్ర ఆయుష్ సెక్రెటరీ రాజేష్‌కు కొటేషన్ కూడా పంపినామని చెప్పారు.నేచర్ క్యూర్ దవాఖాన కోసం రూ.6 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సిద్దిపేటలో మాదిరిగానే వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లిలో కూడా 50 పడకలతో కూడిన ఆయుష్ దవాఖానలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో 834 ఆయుష్ డిస్పెన్సరీలు, 5 కాలేజీలు, 4 రీసెర్చ్ హాస్పిటల్స్ ఉన్నాయని, వీటిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కరోనా వైరస్‌కు చికిత్స మాదిరిగా అనవసరపు సీ సెక్షన్లు పెరిగాయని, తల్లీబిడ్డ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైతేనే తప్ప సీ సెక్షన్ చేయవద్దని డాక్టర్లకు అవగాహన కల్పిస్తున్నామని హరీష్‌రావు చెప్పారు.

## అమరుల ఆశయాలను కొనసాగిద్దాం : అల్లం నారాయణ



కరీంనగర్, డిసెంబర్ 19(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరుల ఆశయాలను కొనసాగిద్దామని తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. సోమవారం హన్మకొండ నుంచి పెద్దపల్లి మీదుగా గోదావరిఖని వెళుతున్న సందర్భంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆయన నివాళులర్పించి నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. ఎన్నో ఆశయాలతో సాధించికున్న తెలంగాణను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలుపరుస్తుందని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమంతో బంగారు తెలంగాణను తయారుచేస్తున్న ప్రభుత్వానికి మనమంతా రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు అల్లం నారాయణకు పూలబొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు. జర్నలిస్టులు వేణుగోపాల్, మల్లేష్, తిరుపతి గౌడ్, శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం వేడుకల నిర్వహణకు పోలీసుల కొత్త రూల్స్

**-న్యూ ఇయర్ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక**

**-మద్యం తాగి వాహనం నడుపుతూ చిక్కితే రూ. 10 వేల జరిమానా**

**-ఆరు నెలల జైలు శిక్ష**

**-దీర్ఘకాలికంగా డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్**

హైదరాబాద్ డిసెంబర్ 19(ఎక్స్ ప్రెస్ న్యూస్): నూతన సంవత్సరం వేడుకల నిర్వహణకు తెలంగాణ పోలీసులు కొత్త రూల్స్ పెట్టారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ నిర్వహించేవారు అనుసరించాల్సిన నియమ నిబంధనలపై నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాత్రి ఒంటి గంట వరకు వేడుకలు నిర్వహించే 3 స్టార్, ఆ పైస్థాయి హోటల్స్, క్లబ్స్, పబ్స్ తప్పనిసరిగా పదిరోజుల ముందు అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. బయట తగిన సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవడంతోపాటు డ్రగ్స్, ఆయుధాలు ఎట్టి పరిస్థితుల్లోను లోపలికి అనుమతించొద్దని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించినవారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అలాగే, డీజే, మ్యూజిక్ సిస్టంలతోపాటు పటాకుల శబ్దాలు 45 డెసిబుల్స్‌కు మించకూడదని స్పష్టంచేశారు. ఎక్సైజ్‌శాఖ అనుమతించిన సమయం తర్వాత మద్యం సరఫరా చేయొద్దని తెలిపారు. నియమ నిబంధనలకు సంబంధించిన డిస్‌ప్లేలను అన్ని చోట్ల ఏర్పాటు చేయాలని సూచించారు. న్యూ ఇయర్ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి ఉంటుందని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడుపుతూ చిక్కితే రూ. పదివేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్షతోపాటు మూడు నెలలపాటు లేదా దీర్ఘకాలికంగా డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.



## సోలార్ ఎనర్జీ కంప్యూటర్‌లలో నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ

హైదరాబాద్, 19 డిసెంబర్ 2022: రూరల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్కిల్ ఎంపవర్‌మెంట్ (ఆర్ఐఎస్ఇ) సౌరశక్తి ఇన్‌స్టాలేషన్ మరియు కంప్యూటర్‌లలో నైపుణ్యాల అభివృద్ధి మరియు శిక్షణను అందించడానికి కొత్త బ్యాచ్‌ను ప్రారంభిస్తోంది. నిరుద్యోగ ఎస్సీ యువతకు 3 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం తెలంగాణ షెడ్యూల్డ్ కాస్టెస్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న రూరల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్కిల్ ఎంపవర్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ కార్యక్రమం జరుగుతుంది. సోలార్ ఎనర్జీ ఇన్‌స్టాలేషన్, కంప్యూటర్లపై శిక్షణతో పాటు యువతకు ప్రాథమిక సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం ఉచిత భోజన వసతి కల్పిస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి కనీస అర్హత దరఖాస్తుదారులు 10వ మరియు/లేదా 12వ ఉత్తీర్ణత మరియు 18-25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. ఈ శిక్షణ పొందాలనుకునే ఎస్సీ నిరుద్యోగులు 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్‌లు, విద్యా ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రం మరియు ఆధార్ కార్డ్‌ని గ్రామీణ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్కిల్ ఎంపవర్‌మెంట్‌లో సమర్పించాలి. పత్రాన్ని సమర్పించడానికి మరియు ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవడానికి చివరి తేదీ 21 డిసెంబర్ 2022. దరఖాస్తుదారులు తమ పత్రాలను ప్లాట్ నెం 705, సాన్వి టవర్స్, అయ్యప్ప సొసైటీ, మాదాపూర్, తెలంగాణ 500081లో ఉన్న ఆర్ఐఎస్ఇ శిక్షణా కేంద్రానికి సమర్పించవచ్చు. మరింత సమాచారం కోరుకునే దరఖాస్తుదారులు ఆర్ఐఎస్ఇ శిక్షణా కేంద్రాన్ని +91 8008025271లో సంప్రదించవచ్చు.నూతన బ్యాచ్‌ను ప్రారంభించిన సందర్భంగా గ్రామీణ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్కిల్ ఎంపవర్‌మెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఇ కణ్ణన్ మాట్లాడుతూ, తెలంగాణలోని నిరుద్యోగ ఎస్సీ యువతకు సోలార్ ఎనర్జీ ఇన్‌స్టాలేషన్ మరియు కంప్యూటర్‌లలో శిక్షణ పొందేందుకు ఇది మంచి అవకాశం అని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వనపర్తి అభివృద్ధి కండ్ల ముందే కనిపిస్తున్నది : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



వనపర్తి, డిసెంబర్ 19:: కండ్ల ముందే వనపర్తి జిల్లా అభివృద్ధి కనిపిస్తుందని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు పలువురు మంత్రులతో కలిసి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. మంత్రి నిరంజన్‌రెడ్డి ఏది మాట్లాడినా దాని వెనుక ప్రజల ప్రయోజనం ఉంటుందన్నారు.

వనపర్తి ప్రజలు భవిష్యత్‌లో సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డిని తప్పకుండా గుర్తు పెట్టుకుంటారన్నారు. బీసీ మహిళా డిగ్రీ కళాశాలలో వ్యవసాయ కోర్సు ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు.

అందరు సమన్వయంతో పని చేయడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో 1,153 జూనియర్ గురుకుల కళాశాలలు ఉన్నాయని, రూ.20 లక్షల ఓవర్సీస్ స్కాలర్ షిప్ ఇచ్చి విద్యార్థులను చదివిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. రూ.3500 కోట్లతో 'మన ఊరు ? మనబడి' కింద అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. నీళ్లు తెచ్చి.. నీళ్ల నిరంజన్‌రెడ్డిగా పేరు తెచ్చుకున్నారని.. ఇన్ని విద్యాసంస్థలు తెచ్చినందుకు ఇంకో పేరు పెట్టాలని అన్నారు. పోటీని తట్టుకునేందుకు ఆంగ్ల విద్య తప్పనిసరి భావించిన తెలంగాణ ప్రభుత్వం.. మేరకు ప్రోత్సహిస్తుందన్నారు.

### బీసీలను విద్యకు దూరం చేశారు : గంగుల

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో 60 శాతం ఉన్న బీసీలను విద్యకు దూరం చేశారని మంత్రి గంగుల విమర్శించారు. చదువులో బీసీలు వెనుకబడలేదని, వెనుకపడేయబడ్డారన్నారు. చదువు అందుబాటులోక కులవృత్తుల్లోనే ఉపాధిని వెతుకున్నారన్నారు. తెలంగాణ రాక ముందు తెలంగాణ 19 బీసీ గురుకులాలు మాత్రమే ఉండేవని, ఆర్థిక ఇబ్బందులతో తల్లిదండ్రులు బిడ్డలను ఉన్నత విద్యకు దూరం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ 310 బీసీ గురుకులాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ బిడ్డలు తెలంగాణ ఆస్తి అని, వారిని సీఎం కేసీఆర్ చదివిస్తున్నారన్నారు.

దేశంలో ప్రథమంగా డిగ్రీ గురుకుల కళాశాలలు ఏర్పాటు చేశారని, ఆస్తులమ్ముకుని పిల్లలను చదివించుకునే దుస్థితిని కేసీఆర్ తప్పించారన్నారు. భవిష్యత్ ఉపాధి, ఉద్యోగ అవకాశాలను దృష్టిలో పెట్టుకుని కొత్త కోర్సులను డిగ్రీ కళాశాలల్లో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఎంపీ పోతుగంటి రాములు మాట్లాడుతూ వనపర్తి.. వనరులపర్తి అని, త్వరలో వనపర్తి, నాగర్ కర్నూలు, గద్వాలకు కేంద్రీయ విద్యాలయాలు తీసుకువస్తామన్నారు. భవిష్యత్‌లో ఇతర ప్రాంతాలకు వనపర్తి ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

## తెలంగాణ ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదల.. మార్చి 15 నుంచి ఎగ్జామ్స్

హైదరాబాద్, డిసెంబర్ 19:ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. వచ్చే ఏడాది (2023) మార్చి 15వ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఫిబ్రవరి 15 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్స్‌ను జరుపనున్నట్లు వివరించింది. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ ఎగ్జామ్‌ను 2023 మార్చి 4న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను మార్చి 6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఎగ్జామ్స్ విభాగం జాయింట్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ తెలిపారు.

## ఒడిశాలోని మద్యం తయారీ డిస్టిలరీలో తెలంగాణ అబ్కారీ పోలీసుల సోదాలు

**-సుమారు రూ.10 కోట్లు విలువైన అక్రమ మద్యం సీజ్**

**-రూ.కోటికి పైగా విలువైన మద్యం ప్యాకింగ్ చేసే యంత్రాలను సీజ్**



హైదరాబాద్ డిసెంబర్ 19 (ఎక్స్ప్రెస్ న్యూస్ )బి:: ఒడిశాలోని మద్యం తయారీ డిస్టిలరీలో తెలంగాణ అబ్కారీ పోలీసులు భారీగా అక్ర మద్యాన్ని సీజ్ చేశారు. ఒడిశా నుంచి రాష్ట్రానికి పెద్దమొత్తంలో అక్రమ మద్యం పంపిణీ అవుతున్నట్లు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. దీంతో రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య ఆధ్వర్యంలో ఒడిశాకు వెళ్లిన అబ్కారీ పోలీసులు టాంగీలోని మద్యం తయారీ కేంద్రంలో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో భారీగా అక్రమ మద్యం, ముడిసరుకు, లేబుళ్లను సీజ్ చేశారు.అక్రమ మద్యం విలువ సుమారు రూ.10 కోట్లు ఉంటుందని, రూ.కోటికి పైగా విలువైన మద్యం ప్యాకింగ్ చేసే యంత్రాలను సీజ్ చేశామని అధికారులు తెలిపారు. కాగా, ఇటీవల కాలంలో నల్లగొండ, చౌటుప్పల్, రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీగా అక్రమమద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా ఒడిశా నుంచి అది సరఫరా అవుతున్నట్లు గుర్తించారు. ఈనేపథ్యంలో ఒడిశాలోని డిస్టిలరీలో అధికారులు సోదాలు నిర్వహించారు.

## రాష్ట్రపతిని కలిసిన గూగుల్ సీఈఓ.. డిజిటల్ లిటరసీకి కృషి చేయాలని కోరిన ముర్ము

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: భారత పర్యటనలో ఉన్న గూగల్, ఆల్ఫబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ ఈ రోజ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రపతి భవన్‌లో ముర్ముతో గూగుల్ ఫర్ ఇండియా 2022 ఈవెంట్ గురించి ఆయన కాసేపు మాట్లాడారు. అంతేకాదు ఆమెకు గూగుల్ ఈవెంట్ ప్రతిని అందజేశారు. ముర్ముతో పిచాయ్ దిగిన ఫొటోలను రాష్ట్రపతి భవన్ అధికారిక ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. భారతదేశ తెలివితేటలు, నైపుణ్యానికి సందర్ పిచాయ్ నిదర్శనమని రాష్ట్రపతి అన్నారు. అంతేకాదు భారతదేశంలో అంతర్జీయ డిజిటల్ అక్షరాస్యత కోసం కృషి చేయాలని ఆమె సుందర్‌ను కోరారు. ఈ రోజు గూగుల్ ఫర్ ఇండియా 2022 కార్యక్రమాన్ని గూగల్ నిర్వహిస్తోంది. ఈ ఈవెంట్‌ను భారతదేశంలో జరపడం ఇది ఎనిమిదో సారి. గూగుల్ ఇండియా హెడ్ సంజయ్ గుప్తా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతదేశాన్ని డిజటలైజేషన్ చేసేందుకు గూగుల్ 2020లో మొదలుపెట్టిన ఫండ్ గురించి ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన పలు సేవలు, యాప్స్‌ను గూగుల్ వెల్లడించింది. గూగుల్ ఫర్ ఇండియా 20200 ఈవెంట్‌ను యూట్యూబ్‌లో లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నారు.ప్రపంచంలోని అతిపెద్ద సెర్చ్ ఇంజిన్ గూగుల్‌కు సీఈఓగా ఉన్న సుందర్ పిచాయ్ తమిళనాడులోని మధురైలో పుట్టారు. ఆయన అసలు పేరు పిచాయ్ సుందరరాజన్. ఆయన 2015లో గూగుల్ సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు గూగుల్ వ్యవస్థాపకుడు ల్యారీ పేజ్ ఆయనను గూగుల్‌లో ప్రొడక్ట్ మేనేజర్‌గా పనిచేశారు.

# బానిసత్వపు బతుకులకు విముక్తి ఎన్నటికీ..!

వెట్టచాకిరీ చట్టవిరుద్ధం, అమానవీయం, ఆక్షేపణీయం. పేదరికం వెక్కిరిస్తున్న భారతంలో బాలకార్మిక వ్యవస్థ ఊడలు విస్తరిస్తూనే ఉన్నాయి. డిజిటల్ యుగంలో మిలియన్ల బడుగులు అవిద్య, అధిక జనాభా, మానవ అక్రమ రవాణా, గృహ చాకిరీలతో కొట్టుమిట్టాడుతున్నారు. బానిసత్వ భావనలు, ఆచారాలు రాజ్యమేలుతున్నాయి. గృహ సంబంధ సేవలకు బాలల్ని వినియోగించడం సర్వసాధారణం అయ్యింది. ప్రపంచవ్యాప్తంగా 18 మిలియన్ల నిరుపేదలు బానిసల వలె ఇటుక బట్టీలు, కార్పెట్ పరిశ్రమలు, గ్లాస్‌వేర్ ఉత్పత్తి క్షేత్రాలు, గాజుల తయారీ కేంద్రాల్లో అతి ప్రమాదకర వాతావరణంలో పని చేస్తున్నారు. స్వల్ప అప్పుల ఎర చూపి కుటుంబాలను బంధించి, శ్రమదోపిడి (తక్కువ భత్యానికి ఎక్కువ శ్రమ) చేయడాన్ని వెట్టిచాకిరీగా వ్యవహరించాలి. పట్టణ ప్రాంతాలే కాకుండా గ్రామీణ భారతంలో కూడా చాకిరీ వ్యవస్థ విస్తరించింది.

వెట్టిచాకిరీ/బానిసల కేంద్రంగా భారతం:

పౌర హక్కుల సంఘాల అంచనా ప్రకారం కనీసం 30 మిలియన్ల అభాగ్యులు వెట్టిచాకిరీ ఉచ్చులో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తున్నది. భారత జనాభాలో 1.4 శాతం బానిస బతుకులు అనుభవిస్తున్నారు. 2018 వివరాల ప్రకారం 18.3 మిలియన్ల అభాగ్యులు బానిస విషవలలో చిక్కినారని తెలుస్తున్నది. ఒక్క యూపీ రాష్ట్రంలోనే 5 – 14 ఏండ్ల మధ్య వయస్సు కలిగిన 2.1 మిలియన్ బాలలు బానిసలు బతుకుతున్నట్లు నిపుణులు వెల్లడించడం ఓ హెచ్చరికగా భావించాలి. ప్రపంచ దేశాల్లో బానిసల శ్రమదోపిడి విస్తరించి ఉంది. ఇండియాలోనే అత్యధికంగా 14 మిలియన్ల వరకు పేదలు బానిస ఉచ్చులో చిక్కి ఉన్నారని తెలుస్తున్నది. బుందేల్‌ఖండ్, బీహార్, ఝార్ఖండ్ ప్రాంతాలు వెట్టిచాకిరీ కేంద్రాలుగా పేరు తెచ్చుకుంటున్నాయి. గ్లోబల్ స్లేవరీ ఇండెక్స్ వివరాల ప్రకారం 167 దేశాల జాబితాలో భారతానికి 53వ స్థానం వచ్చింది. ప్రపంచ బానిసల్లో 71 శాతం మహిళలు, బాలికలు ఉండడం ఆశ్చర్యాన్నే కాకుండా బాధను కూడా కలిగిస్తున్నది.

బానిసత్వం/వెట్టిచాకిరీ పెరగడానికి కారణాలు:

కడు పేదరికం, అవిద్య, అవగాహనలేమి, పొట్ట చేత పట్టుకొని వలసలు వెళ్లడం, సామాజిక మూఢనమ్మకాలు, ఆర్థిక అనారోగ్యం, యాజమాన్యాల దోపిడి సంస్కృతి, యాజమాన్యాలకు చట్టాల పట్ల అవగాహన లేకపోవడం, కేంద్ర రాష్ట్ర స్థానిక ప్రభుత్వ వ్యవస్థల సమన్వయలోపం, చట్టాల అమలు కనిపించక పోవడం, నేరం చేసిన యాజమాన్యాలకు శిక్షలు పడకపోవడం లాంటి పలు కారణాలు చాకిరీని పోషిస్తున్నాయి. కార్మిక శక్తి తక్కువగా ఉండడంతో చాకిరీ ఆచారం కొనసాగుతున్నది. యుద్ధ బంధీలు, మతపర కారణాలు కూడా బానిసత్వాన్ని పెంచిపోషిస్తున్నాయి.

బానిసత్వం/వెట్టిచాకిరీ నివారణ మార్గాలు:

వెట్టిచాకిరీ, బానిసత్వ దురాచారాల పట్ల అవగాహన కల్పించడం ప్రభుత్వ, ప్రభుత్వేతర స్వచ్ఛంధ సంస్థల బాధ్యత. బాల కార్మిక వ్యవస్థను కఠిన చట్టాల అమలుతో కూకటి వేళ్లతో పీకి వేయాలి. చాకిరీ వలలోంచి రక్షించబడిన బడుగులకు పునరావాసం కల్పించడంతో పాటు గౌరవప్రద పనిని కల్పించాలి. పౌరులకు అర్హతకు తగిన పని కల్పించడంతో పాటు పనికి సరైన వేతనం ఇప్పించే కనీస బాధ్యత ప్రభుత్వాలదని మరువరాదు. వ్యవసాయరంగంతో పాటు ప్రైవేట్ రంగంలో శ్రమదోపిడిని తగ్గించేలా తరుచుగా తనిఖీలు నిర్వహించాలి. ఒడిస్సా, రాజస్థాన్, కేరళ లాంటి రాష్ట్రాలు చాకిరీకి వ్యతిరేకంగా ప్రత్యేక చట్టాలు చేయడం హర్షదాయకం.

కాగితాలకే పరిమితమైన చట్టాలు:

బడిలో వికసించవలసిన చిన్నారి పువ్వులు బట్టీల్లో మాడి మసి బొగ్గుగా మారడం అతి విచారకరం. వెట్టిచాకిరీ నిషేధ వ్యవస్థ చట్టం–1976 ప్రకారం మానభంగాలు, శ్రమ దోపిడి, హింస, దాడి, కిడ్నాప్‌లు, బలవంతంగా బంధించడం, చాకిరీ కోసమే బాలల్ని కొనడం, చట్టవ్యతిరేకంగా నేర వృత్తిలోకి దించడం లాంటి అమానవీయ చర్యలకు పూనుకున్న వారికి 10 ఏండ్ల వరకు జైలుతో పాటు నగదు ఫైన్ విధించడం జరుగుతుందని తెలిసినా విచ్చల విడిగా ఈ అకృత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. బాలల న్యాయ చట్టం–1986 ప్రకారం బాలలను బలవంతంగా పనుల్లో వినియోగించడం, నేరప్రవృత్తిని పెంచి పోషించే నేరానికి 3 ఏండ్ల వరకు కారాగారవాసం ఇవ్వవచ్చు. ప్రజలకు కనీస అవసరాలు కల్పించవలసిన ప్రభుత్వాలు చాకిరీ వ్యవస్థను నిర్మూలించే చర్యలను చేపట్టడంలో పూర్తిగా విఫలం అవుతున్నాయి. చాకిరీ, బానిసత్వ దురాచాలను రూపుమాపడానికి పౌర సమాజం ప్రధాన బాధ్యతను తీసుకోవాలి. వీటికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం, బానిసలు మార్చే యాజమాన్యాలను బోనులో నిలపడం, సామాన్య బడుగులకు అవగాహన కలిపించడం విధిగా నిర్వహించాలి.

అనాదిగా శ్రమ దోపిడి దురాచారం:

ఆకలి కోరల్లో బతుకులు ఈడుస్తున్న అభాగ్యులు మరో మార్గం తోచని దుస్థితిలో వెట్టి చాకిరీ విష వలయంలో చిక్కి బతుకుల్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. పని ప్రదేశంలోనే చాపంత భూమిలో గుడారాలు వేసుకొని అతి ప్రమాదకర వాతావరణంలో బతుకుతున్నారు. ఇటుక బట్టీల్లో వెయ్యి ఇటుకలు చేసిన వారికి రూ: 200/- ఇవ్వడం, యాజమాన్యాలు వాటిని కనీసం ఏడు వేలకు అమ్మడం జరుగుతోంది. బట్టీల్లో పని చేసే బాలికలు, మహిళలను బలవంతంగా వశపర్చుకొని లైంగికంగా వేధించడం, హింసించడం సర్వసాధారణంగా కనిపిస్తున్నది. ఇటుక బట్టీల్లో అత్యధికంగా నిరక్షరాస్య యస్‌సి, యస్‌టి, మైనారిటీ వర్గాలకు చెందిన పేదలు పని చేయడం జరుగుతోంది. యూపీ బదోలి ప్రాంతంలోని కార్పెట్ల పరిశ్రమల్లో వెట్టిచాకిరీ తీవ్రత అధికంగా కనిపిస్తున్నది. చేతి గాజులు 350 తయారు చేసిన వారికి ఆరు రూపాయలు చెల్లిస్తారు. ఒక రోజులో 12–14 గంటలు పని చేసిన వారికి 180/- వరకు కూలీ చెల్లిస్తున్నారు. జీవించే హక్కు, సమానత్వ హక్కు, గౌరవప్రద హక్కు కల్పించబడిన భారతంలో వెట్టిచాకిరీ వ్యవస్థ యద్ధేచ్ఛగా కొనసాగడం దౌర్భాగ్యం, అవమానకరం.

ఆధునిక నాగరిక సమాజంలో మనిషిని మనిషిలా చూడడం మరిచిన సమాజం రాక్షస రాజ్యాన్ని తలపిస్తుంది. మురికి కూపాల్లో జీవచ్ఛవాలుగా బతుకుతున్న బడుగుల జీవితాల్లో వెలుగులు నింపేదెన్నడు, ఆదుకునే ఆప్తులు ఎవ్వరు ? బాల్య వివాహాలు, బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి దించడం లాంటి అనాగరిక పరిస్థితులు సమస్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి. చట్టాలు, సంకెళ్ల భయంతో వెట్టిచాకిరీ, బానిసత్వాలను తగ్గించే మహాయజ్ఞంలో మనందరం చేయి చేయి కలుపుదాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037



## మీ రుణం మర్చిపోము..

**– మంత్రి అజయ్‌కుమార్‌కు అభినందనలు..**
**టీయూడబ్ల్యూజే**

ఖమ్మం, డిసెంబర్ 19:: (నేటినిజం ప్రతినిధి): నూతన సంవత్సరపు బహుమానంగా ఖమ్మం జిల్లా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇండ్ల అంశంలో శుభవార్త చెపుతానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రకటించడం పట్ల టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఖమ్మం జిల్లా శాఖ సోమవారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించింది. టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రారవి, టెంజూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేముల రామకృష్ణ, శెట్టి రజనీకాంత్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు పలు కీలక అంశాలను పేర్కొన్నారు. ప్రధానంగా ఆదివారం ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగిన టీయూడబ్ల్యూజే ఉమ్మడి ఖమ్మం జిల్లా 3వ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జర్నలిస్టుల పట్ల చూపిన అభిమానం ఎన్నటికీ మరువలేదని అన్నారు. ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న జర్నలిస్టుల ఇండ్ల సమస్య పరిష్కారానికి తాను రోల్ మోడల్‌గా ఉంటాననీ, మొదటిగా తన నియోజకవర్గంలోనే నూతన సంవత్సరం ప్రారంభంలో జర్నలిస్టులకు అందజేసి, మిగతా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలను సమన్వయం చేసి అర్హత ఉన్న ప్రతీ జర్నలిస్టుకూ ఇంటి స్థలం అందేలా కృషి చేస్తాననీ, జర్నలిస్టుల రుణం తీర్చుకుంటానని ప్రకటించడం యావత్ జర్నలిస్టు సమాజానికి కొత్త బలాన్ని ఇస్తుందన్నారు. మంత్రి పువ్వాడ తీసుకున్న నిర్ణయాన్ని తమ యూనియన్ మనస్పూర్తిగా స్వాగతిస్తోందన్నారు. ఇది జర్నలిస్టులకు శుభదినమని అన్నారు. మంత్రి అజయ్ కుమార్ వెల్లడిరచినట్టుగా మిగతా నియోజకవర్గాల్లోని శాసనసభ్యులు సైతం ఆయా నియోజకవర్గాల్లోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశంపై దృష్టిసారించాలని విజ్ఞప్తిచేశారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు

ఖమ్మం జిల్లా ప్రెస్‌క్లబ్‌కు సొంత స్థలం ఉండాలన్న మంచి ఆశయంతో మన జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక చొరవతో ఇటీవల ఖమ్మం పట్టణంలోని ఎన్ఎస్‌పీ ఏరియాలో స్థలం కేటాయించడం అభినందించదగిన విషయం కాగా, ఆ స్థలంలో ప్రెస్‌క్లబ్‌కు భవన నిర్మాణానికి గాను తమ వంతుగా నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లోనుండి ప్రజాప్రతినిధులు రూ. 40 లక్షలు కేటాయించడం అతిపెద్ద విజయమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జర్నలిస్టులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఖమ్మం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న వారు జర్నలిస్టులకు అండగా నిలవడంతో జర్నలిస్టులో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. ప్రధానంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తన వంతుగా రూ. 10 లక్షలు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ రూ. 10 లక్షలు, ఎంపీలు నామ నాగేశ్వరరావు రూ. 10 లక్షలు, వద్దిరాజు రవిచంద్ర రూ.10 లక్షలు జర్నలిస్టుల హర్షధ్వానాల నడుమ ప్రకటించి జర్నలిస్టుల పట్ల తమకు ఉన్న మక్కువను చాటుకున్నారని అన్నారు. మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన ఎస్ఆర్ గార్డెన్‌ను ఓ వివాహానికి ఇవ్వాల్సి ఉన్నా కూడా జర్నలిస్టులపై తనకున్న అభిమానంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా మహాసభకు ఇవ్వడం పట్ల టీయూడబ్ల్యూజే ఉమ్మడి ఖమ్మం జిల్లా శాఖల బాధ్యులు తమ కృతజ్ఞతలు తెలిపారు. వివిధ కారణాలతో మహాసభకు హాజరుకాలేక పోయిన జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు, కలెక్టర్‌కు యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది. జర్నలిస్టులకు సహకరించిన ఎంపీ (రాజ్యసభ) బండి పార్ధసారథిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మహాసభకు హాజరైన రాష్ట్ర బాధ్యులకు కృతజ్ఞతలు టీయూడబ్ల్యూజే ఉమ్మడి ఖమ్మం జిల్లా 3వ మహాసభకు రాష్ట్ర నాయకత్వం పాల్గొని నూతన కమిటీలను స్వయంగా ప్రకటించి, అందరి మన్ననలూ అందుకున్నారని ఉమ్మడి ఖమ్మం జల్లా శాఖలు అభినందనలు తెలిపాయి. ప్రధానంగా మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, సీఎం పౌరసంబంధాల అధికారి రమేష్ హజారే, యూనియన్ రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, మేకల కల్యాణ్ చక్రవర్తి, తదితరులకు యూనియన్ జిల్లా బాధ్యులు కృతజ్ఞతలు తెలపారు. వీరితో పాటు సుమారు 1200కు పైగా జర్నలిస్టులు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి తరలివచ్చి, 3వ మహాసభను దిగ్విజయం చేసిన ప్రతీ ఒక్కరికీ యూనియన్ నాయకులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, వేముల రామకృష్ణ, శెట్టి రజనీకాంత్ తదితరులు తమ అభినందనలు తెలిపారు. రాబోవు కాలంలో జర్నలిస్టుల హక్కుల కోసం మరింత ఐక్యంగా కలిసి పనిచేద్దామని వారు పేర్కొన్నారు.

## శాస్త్రీయ ప్రచురణల్లో భారత స్థానం 7 నుంచి 3 కు పెరిగింది: కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 19:శాస్త్రీయ ప్రచురణల్లో భారత స్థానం 7 నుంచి 3 కు ఎగబాకింది. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ విషయం వెల్లడించారు. శాస్త్ర సాంకేతిక విభాగం కేంద్ర కార్యదర్శి డాక్టర్ ఎస్. చంద్రశేఖర తో సమీక్ష అనంతర మంత్రి ఈ విషయం ప్రకటించారు. భారత శాస్త్రవేత్తలు అవిశ్రాంతంగా చేస్తున్న కృషిని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. శాస్త్రవేత్తలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేయటానికి తగిన వాతావరణం కల్పించారని ప్రధానికి కృతజ్ఞతలు కూడా తెలియజేశారు. గత కొద్ది సంవత్సరాలలోనే శాస్త్ర పరిశోధనలలో చెప్పుకోదగిన పురోగతి కనబడుతోందన్నారు. ప్రాధాన్య క్రమాలు నిర్ణయించటంలోనూ, విధానాన్ని సులభతరం చేయటంలోనూ ప్రధాని నిర్ణయాలు సానుకూలంగా ఉన్నాయన్నారు.

అమెరికాకు చెందిన నేషనల్ సైన్స్ ఫౌండేషన్ వారి సైన్స్ అండ్ ఇంజనీరింగ్ సూచికలు–2020 నివేదిక ప్రకారం అంతర్జాతీయ స్థాయిలో భారతీయ శాస్త్ర సాంకేతిక పరిశోధనాపత్రాల ప్రచురణ రాంకు 7 నుంచి 3 వ స్థానానికి ఎగబాకింది. భారత పరిశోధకుల అధ్యయనపత్రాలు 2010 లో 60,555 కాగా, 2020 నాటికి 1,49,213 కు పెరిగియని, ఇందులో కూడా భారత్ మూడో స్థానంలో ఉందని మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. సైన్స్ పట్ల ప్రత్యేకమైన గౌరవం ఉండటంతోబాటు సైన్సు అభివృద్ధికి అండగా నిలబడటం వల్లనే ఆత్మ నిర్భర భారత్ లో కీలకపాత్ర పోషించటానికి ఈ రంగం సిద్ధమైందన్నారు.

భారతదేశంలో శాస్త్ర పరిశోధన తీరు గత కొద్ది సంవత్సరాలలో బాగా మెరుగుపడిందని పరిశోధనా ప్రచురణలలో, టెక్నాలజీలు, నవకల్పనల పెరుగుదలలో ఆ విషయం స్పష్టంగా కనబడుతోందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. దీనివలన సర్వతోముఖాభివృద్ధి జరిగిందన్నారు. సైన్స్, ఇంజనీరింగ్ విభాగాలలో భారతదేశంలో పి హెచ్ డి ల సంఖ్య ప్రపంచంలో మూడో స్థానంలో ఉండటం గర్వించదగిన విషయమన్నారు. గడిచిన మూడేళ్లలో భారత శాస్త్రవేత్తలకు లభించిన పేటెంట్లు కూడా పెరిగాయని, 2018–19 లో 2511 ఉండగా 2019–20 కి 4003 కు, 2020–21 నాటికి 5629 కి పెరగటాన్ని ఆయన ప్రస్తావించారు.

అమెరికాకు చెందిన స్వతంత్ర సంస్థ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ ప్రాథమిక పరిశోధనను, వైద్యేతర రంగాలైన సైన్స్, ఇంజనీరింగ్ లో విద్యను ప్రోత్సహిస్తుంది. ప్రపంచ మేథో సంపత్తి సంస్థ వెలువరించిన అంతర్జాతీయ నవకల్పనల సూచీ –2022 ప్రకారం భారత స్థానం 2014 లో 81 ఉండగా 2022 లో అది గణనీయంగా పెరిగి 40 వ స్థానానికి వచ్చింది. శాస్త్ర, సాంకేతిక రంగాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని, సంబంధిత శాఖలకు నిధుల కేటాయింపు పెంచిందని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు.

గత బడ్జెట్ తో పోల్చినప్పుడు 2023–24 బడ్జెట్ లో శాస్త్ర, సాంకేతిక విభాగానికి కేటాయించే బడ్జెట్ 29 శాతం మేరకు పెరిగే అవకాశం ఉందని ఒక సీనియర్ అధికారు అన్నారు. గత బడ్జెట్ లో సైన్స్ అండ్ టెక్నాలజీకి రూ.6,002 కోట్లు కేటాయించగా అది మొత్తం మంత్రిత్వశాఖ కేటాయింపులో 42%. కార్పొరేట్ రంగం పరిశోధనలమీద పెట్టే ఖర్చును కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధి నుంచి ఇచ్చుకోవచ్చునని ప్రభుత్వం అనుమతించింది. టెక్నాలజీ సంబంధిత ఇన్ క్యుబేటర్లలో పెట్టుబడి పెట్టాలని కార్పొరేట్ రంగాన్ని ప్రభుత్వం కోరుతోంది. అదే విధంగా జాతీయ స్థాయి పరిశోధనాలయాల్లో కూడా ఖర్చుపెట్టాలని కోరింది. అలాంటి వ్యాయానికి వన్ను రాయితీలకు కూడా హామీ ఇచ్చింది.

## దేశవ్యాప్త ప్రచారం ప్రశాసన్ గాంవ్ కి ఓర్ అన్న సుపరిపాలన వారోత్సవం

న్యూఢిల్లీ, డిసెంబర్ 19:దేశవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు గుర్తించిన 3,120 సేవలను ఐదురోజుల ప్రశాసన్ గావ్ కి ఓర్ కేంపెయిన్ సందర్భంగా ఆన్‌లైన్ సేవా బట్వాడాకు జోడించనున్నారు. ఈ ప్రచారాన్ని కేంద్ర సిబ్బంది, ప్రజా సమస్యలు, పింఛన్ల శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సోమవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రారంభించనున్నారు.

డిసెంబర్ 10–18, 2022 వరకు జరిగిన సుపరిపాలనా వారోత్సవాలు 2022 సన్నాహక దశ సందర్భంగా సేవల బట్వాడా కోసం దాఖలు చేసిన 81,27, 944 ని పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు గుర్తించడంతో పాటుగా 19,48,122 ప్రజా సమస్యలను రాష్ట్ర గ్రీవెన్స్ పోర్టల్ పై పరిష్కరించేందుకు గుర్తించారు.

డిసెంబర్ 23, 2022న జరగనున్న జిల్లా స్థాయి వర్క్‌షాప్‌లలో చర్చల కోసం 373 ఉత్తమమైన సుపరిపాలనా పద్ధతులను గుర్తించినట్టు డిఎఆర్‌పిజి కార్యదర్శి శ్రీ వి.శ్రీనివాస్ చెప్పారు. అలాగే, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన 43 విజయ గాథలను కూడా 19 డిసెంబర్ నుంచి 25 డిసెంబర్ 2022వరకు జరుగనున్న సుశాసన్ సప్తాహ్ అన్న సుపరిపాలనా వారోత్సవం–2022లో పంచుకోనున్నారు.

దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలు, తాలూకాలలో సుశాసన్ సప్తాహ్ విజయవంతమయ్యేందుకు ప్రధానమంత్రి తన శుభాకాంక్షలను తెలిపారు. తన సందేశంలో, ఈ ఏడాది కూడా ప్రశాసన్ గాంవ్ కి ఓర్ ప్రచారం అన్నది సుపరిపాలనా వారోత్సవంలో భాగంగా కొనసాగడం నాకు ఆనందకరంగా ఉందన్నారు. మేం ప్రజా సమస్యల పరిష్కారం, ఆన్‌లైన్ సేవలు, సేవా బట్వాడా అప్లికేషన్ల నిర్వహణ, సుపరిపాలనా పద్ధతులు సహా పలు పౌరులు కేంద్రంగా చొరవలను చేపట్టామన్నారు. మా దార్శనికత సేవా బట్వాడా యంత్రాంగాల విస్తృతిని పెంచి వాటిని మరింత సమర్థవంతం చేయడమన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ప్రచారం, సేవల బట్వాడాను మెరుగుపరచడం అన్నవి దేశంలోని అన్ని జిల్లాల్లో, రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తారు. దాదాపు 700మంది జిల్లా కలెక్టర్లు ఈ ప్రచారంలో పాలుపంచుకోనుండగా, అధికారులు తాలూకా, పంచాయతి సమితి కేంద్ర కార్యాలయాలను సందర్శించనున్నారు.

మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సుపరిపాలనా వారోత్సవాలు 2022 పోర్టల్, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.పిజిపోర్టల్. జిఒవి.ఐఎన్/ జిజిడబ్ల్యు22 (లిలిలి.జూణజూనీతీబిజీశ్రీ.ఐనీల.తిని/ఉఉచి22)ను ప్రారంభించనున్నారు. ఇందులో జిల్లా కలెక్టర్లు పురోగతిని అప్‌లోడ్ చేయడమే కాక, సుపరిపాలనా పద్ధతులను, వీడియో క్లిప్‌లను అప్‌లోడ్ చేస్తారు. దేశ సమస్యా పరిష్కార వేదికలు ఏకీకృతంగా పని చేయడానికి సుశాసన్ సప్తాహ్ సాక్షిగా ఉండనుంది. అంటే, సిపిజిఆర్ఎఎంఎస్‌పై అందుకున్న సమస్యలను, రాష్ట్ర పోర్టళ్ళపై అందుకున్న సమస్యలతో పాటుగా పరిష్కరిస్తారు. అమృత్ కాల్ సమయంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు, సేవల బట్వాడాను మెరుగుపరిచేందుకు, తాలూకా స్థాయి వరకు జాతీయ ప్రచారాన్ని నిర్వహించడం ఇది రెండవసారి. ప్రశాసన్ గాంవ్ కి ఓర్ అభియాన్ అన్నది భవిష్యత్ తరాలకు స్ఫూర్తిని ఇచ్చేందుకు సుపరిపాలనను ఒక జాతీయ స్థాయి ఉద్యమంగా సృష్టిస్తుంది.

2022లో ప్రజా సమస్యల పరిష్కారంలో దేశం సాధించిన ప్రగతిని ప్రతిఫలింప చేసేందుకు సిపిజిఆర్ఎఎంఎస్ 2022కు వార్షిక నివేదికను ఈ సందర్భంగా విడుదల చేయనున్నారు. సుపరిపాలన వారోత్సవం 2022కు సన్నాహక దశను 10 నుంచి 18 డిసెంబర్, 2022 వరకు నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు 19 నుంచి 25 డిసెంబర్ 2022 వరకు పరిష్కరించేందుకు దిగువన పేర్కొన్న లక్ష్యాలను డెడికేటెడ్ పోర్టల్‌పై గుర్తించారు.

సేవా బట్వాడా దరఖాసుల వర్గంలో – మధ్య ప్రదేశ్ జిల్లాల్లో 55,72,862 సమస్యలను గుర్తించిన లక్ష్యం కాగా, పంజాబ్‌లోని జిల్లాల్లో గుర్తించిన లక్ష్యం 21,96,987.ప్రజా సమస్యల పరిష్కార వర్గంలో మధ్య ప్రదేశ్ జిల్లాల్లో గుర్తించిన లక్ష్యం 16,67, 296 సమస్యలు కాగా, తమిళనాడు జిల్లాల్లో పరిష్కారానికి గుర్తించిన సమస్యలు 1,38, 621.

జిల్లా స్థాయి ఆవిష్కరణలపై వర్క్‌షాప్‌ను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రతి జిల్లాలోనూ 23 డిసెంబర్ 2022న జరుగుతుంది. ఈ వర్క్‌షాప్ జిల్లా స్థాయి ఆవిష్కరణలపై దృష్టి పెడుతుంది. డిసెంబర్ 23, 2022న జరుగనున్న జిల్లా స్థాయి వర్క్ షాప్‌లలో ప్రెజెంటేషన్ల కోసం 373 జిల్లా స్థాయి ఆవిష్కరణలను గుర్తించారు.. వ్యవస్థల డిజిటల్ పరివర్తన, పౌరుల డిజిటల్ సాధికారతను లక్ష్యంగా పెట్టుకుని చేసిన ఆవిష్కరణలపై దృష్టి.

రెండవ సుశాసన్ సప్తా? భారతదేశంలోని ప్రతి స్థాయిలో సుపరిపాలను ముందుకు తీసుకువెళ్ళేందుకు తోడ్పడుతుంది.

## పైకి అభివృద్ధి పనులు..లోపల అసమ్మతి కుంపట్లు

హైదరాబాద్ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); పైకి అభివృద్ధి పనులు అని చెబుతున్నా.. లోపల మాత్రం అసంతృప్తి సెగ అని పొగ వస్తోంది. కడుపు కాలిన వాసన వస్తోంది. అధికార టీఆర్ఎస్ లో అసమ్మతి జ్వాల ఇప్పుడు మెల్లిగా అంటుకున్నట్టే కనపడుతోంది.రెండు సార్లు గెలిచిన అసమ్మతి.. ముచ్చటగా మూడోసారి గెలుపు సులువు కాదన్న అంచనాలు.. అధికార టీఆర్ఎస్ పార్టీలో ఉంటే గెలవమన్న సంకేతాలు.. ఇక టికెట్ దక్కుతుందో లేదోనన్న భయాలు.. ఓవైపు బీజేపీ తరుముకొస్తున్న వేళ హైదరాబాద్ లో నలుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రహస్యంగా భేటి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నివాసంలో జరిగిన ఈ భేటికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి హాజరయ్యారు. నియోజకవర్గ సమస్యలపైనే భేటి అని ఆయా నేతలు చెబుతుండగా.. ఓ మంత్రికి వ్యతిరేకంగా వీరంతా భేటి అయినట్టు ప్రచారం సాగుతోంది.మల్కాజిగిరి జిల్లాకు చెందిన మంత్రి మల్లారెడ్డి ఆ చుట్టుపక్కల ఉన్న ఎమ్మెల్యేలకు అస్సలు పడదు. దొడ్డిదారిన మంత్రి అయిపోయి తమపై పెత్తనం చెల్లాయిస్తున్న మల్లారెడ్డిపై ఈ అసమ్మతి ఎమ్మెల్యేలు గుర్రుగా ఉన్నట్టు సమాచారం. అందుకే ఈ హైదరాబాద్ శివారు ఎమ్మెల్యేలంతా కలిసి చర్చలు జరుపుతున్నారని.. వీరంతా కాంగ్రెస్ లోకి టచ్ లోకి వెళ్లారని తెలుస్తోంది.పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సహా పలువురితో మాట్లాడారని.. వచ్చేసారి టికెట్లు ఇస్తే ఖచ్చితంగా కాంగ్రెస్ లోకి జంప్ చేయడానికి అభ్యంతరం లేదని చెప్పినట్టు సమాచారం. మరి ఈ ఆఫర్ కేసీఆర్ కు తెలిసిందా? తెలిస్తే ఊరుకుంటాడా? నిజంగానే వీళ్లు కాంగ్రెస్ లోకి వెళుతున్నారా? అన్న దానిపై ప్రస్తుతం అయితే వివరాలు బయటపడడం లేదు. అంతా గోప్యంగా సాగుతోంది. చూస్తుంటే అధికార పార్టీలో అలజడులు మొదలైనట్టే కనిపిస్తోంది. ఇన్నాళ్లు కూడుకట్టుకొని ఉన్నదంతా కక్కేసేలా ఉన్నారు.

## చిత్తూరు డీఆర్డీఏ కు జాతీయ పురస్కారం..

అమరావతి డిసెంబర్ 19: చిత్తూరు జిల్లా గ్రామీణ సంస్థ నిర్వహిస్తున్నవివిధ పథకాలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మమైన రెండు స్కాచ్ సిల్వర్ అవార్డులు దక్కాయి. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డులను డీఆర్డీఏ పీడీ తులసి డీసీఎం వెంకటేషులకు స్కాచ్ ప్రతినిధులు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఆరు అవార్డులు అందగా.. అందులో చిత్తూరు జిల్లాకే రెండు అవార్డు దక్కడం విశేషం. దేశ వ్యాప్తంగా గ్రామీణ అభివృద్ధి మహిళా ఆర్థిక స్వాలంబన తదితర కార్యక్రమాలకు సంబంధించి ఈ అవార్డులకు సుమారు 100కు పైగా ప్రాజెక్టు పోటీపడ్డాయి.

జిల్లాలో పొదుపు సంఘాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న పలు పథకాలను గ్రామీణ ప్రాంత మహిళలు తెలియజేస్తూ వారిలో ఆర్థిక సామాజిక రంగాల పట్ల చైతన్యాన్ని నింపుతూ, జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలచే నిర్వహించబడుతున్న మహిళా నవోదయం మాసపత్రికకు ఈ అరుదైన పురస్కారం తగ్గింది. డీఆర్డీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉపాధి కల్పనా మిషన్ ద్వారా గ్రామీణ యుద్ధ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ వారి భవిష్యత్తుకు పునాది వేస్తున్న ఈజీ ఎంఎం (ఉపాధి కల్పన మిషన్) కూడా ఢిల్లీకి చెందిన స్కాచ్ సంస్థ మరో సిల్వర్ అవార్డును అందజేసింది. చిత్తూరు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థకు ఏకకాలంలో రెండు అవార్డులు రావడం గర్వించదగ్గ విషయమని డీఆర్డీఏ పీడీ తులసి తెలిపారు. జిల్లా కలెక్టర్ హరి నారాయణ సహాయ సహకారాలు డీఆర్డీఏ సిబ్బంది సమిష్టి కృషి వల్లనే సాధ్యమైందని ఆమె వివరించారు. దీంతో మరింత బాధ్యత పెరిగిందని జిల్లాకే రెండు అవార్డులు దక్కడం విశేషమని తెలిపారు.

## వేదవతి సాధన లక్ష్యంగా టీడీపీ నేతల పాదయాత్ర



అమరావతి డిసెంబర్ 19: గత టీడీపీ ప్రభుత్వం ఎనిమిది టీఎంసీలుగా డిపిఆర్ ని ప్రతిపాదిస్తే ఇప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడు టీఎంసీలు వరకే కుదించడం అన్యాయమని, రాయలసీమ పశ్చిమ ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గం ప్రతి సంవత్సరం కరువు కాటకాలు, అతివృష్టి లేదా అనావృష్టి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ కేంద్ర మంత్రి సూర్య ప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ తెలిపారు. వేదవతి సాధన లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ, మాజీ కేంద్ర మంత్రి సూర్య ప్రకాశ్ రెడ్డి నేతృత్వంలో పాదయాత్ర ప్రారంభమైంది. నియోజకవర్గ పరిధిలోని హాలహర్వి మండలం నుండి గల్యం గ్రామం వరకు ఈ పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. వారు మాట్లాడుతూ.. రైతులను ఈ రాష్ట్ర ప్రభుత్వం గుర్తిండంలేదని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని మొదటి ప్రాధాన్యత వేదవతి ప్రాజెక్టుకు కేటాయించి సంపూర్ణంగా పూర్తి చేస్తుందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు కేటాయించకుండా పనులు నిలిపివేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ సంవత్సరంలో కర్ణాటక, అనంతపూర్ పరిసర ప్రాంతాల్లో అధిక వర్షాలు కురవడంతో వేదవతి నది పొంగిపొర్లిందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, అఖిల ప్రియ, బీసీ జనార్దన్ రెడ్డి, జయ నాగేశ్వర్ రెడ్డి, తిక్క రెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరు వెంకట్ రెడ్డి, భారీ సంఖ్యలో తెలుగుదేశం శ్రేణులు పాల్గొన్నారు.

# కేజీ టూ పీజీ విద్యనందించేందుకు గురుకులాలు : మంత్రి సత్యవతి



మహబూబాబాద్, డిసెంబర్ 19(నేటినిజం ప్రతినిధి): నిరుపేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్యనందించేందుకే ప్రభుత్వం గురుకుల విద్యాలయాలను విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నదని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని అమినాపురంలో నిర్మించిన మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. పలువురు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు.

దేశంలో అత్యధిక గురుకుల విద్యాలయాలు కలిగిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో అన్ని సదుపాయాలతో విద్యనందించడంతో పాటు అన్నిరంగాల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ఫలితంగా తల్లిదండ్రుల నుంచి ఆదరణ పెరుగుతుందన్నారు. దేశంలో చివరిగా ఏర్పాటైన రాష్ట్రం తెలంగాణ అని, అభివృద్ధిలో మాత్రం ముందుందన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. త్వరలో మహబూబాబాద్‌లో మరో గిరిజన గురుకుల పాఠశాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే భానోత్ శంకర్ నాయక్, జడ్పీ అధ్యక్షురాలు బిందు, ఆర్డీవో రమేశ్, డీఎస్పీ సదయ్య, డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

# బస్తీ దవాఖానలతోనే పేదలకు మెరుగైన వైద్యం

హైదరాబాద్, డిసెంబర్ 19:రాష్ట్ర ప్రభుత్వం బస్తీ దవాఖానలతోనే పేదలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గౌతంనగర్ డివిజన్, హిల్‌టాప్ కాలనీలోని షేక్ మైబూబ్ పాషా ఇంటిని బస్తీ దవాఖాన ఏర్పాటు కోసం మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్(ఎంఎస్ఎస్‌వో) ట్రస్టు చైర్మన్ మైనంపల్లి రోహిత్‌బాబు రూ.5లక్షలకు కొనుగోలు చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే.. షేక్ మైబూబ్‌కు ఆ నగదును అందజేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే బస్తీ దవాఖా నను ప్రారంభించి.. పేదలకు వైద్య సేవలందిస్తామని తెలిపారు.

తన స్వంత ఖర్చులతో పేదలకు వైద్యం అందిస్తామని, ఆపదలో ఉన్నవారికి మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అండగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసి.. పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారని తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. దేశంలో రైతులు ఎదుర్కొం టున్న సమస్యలు పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్య పడు తుందన్నారు. మైనంపల్లి సోషల్ సర్వీస్ ట్రస్టు ద్వార నిరంతరం పేద లకు సేవలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, హిల్‌టాప్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, నాయ కులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# ప్రాణాలకు తెగించి నీటి ప్రవాహంలో చిక్కుకున్న కుక్కను కాపాడాడు

న్యూఢిల్లీ, డిసెంబర్ 19:ఓ డ్యామ్‌లోని నీటి ప్రవాహంలో చిక్కుకున్న కుక్కను తన ప్రాణాలను పణంగా పెట్టి కాపాడిన వ్యక్తి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆపదలో చిక్కుకున్న జంతువును సకాలంలో కాపాడి ఒడ్డుకు చేర్చిన వ్యక్తిపై నెటిజన్లు ప్రశంసలు గుప్పించారు.

ట్విట్టర్‌లో షేర్ చేసిన ఈ వీడియోను ఇప్పటివరకూ లక్ష మందికి పైగా వీక్షించారు. వైరల్ వీడియోలో రోప్ సాయంతో డ్యామ్‌లోకి దిగి కుక్కను కాపాడటం కనిపిస్తుంది. వీడియోలో సాయం కోసం కుక్క గట్టిగా అరవడం వినిపిస్తుంది.

కుక్కను ఆపద నుంచి కాపాడేందుకు వ్యక్తి తన ప్రాణాన్ని లెక్కచేయకుండా ప్రయత్నించడం నెటిజన్లను ఆకట్టుకుంది. అవసరమైతే అతడికి సాయం చేసేందుకు సిద్ధంగా మరికొందరు ఘటనా ప్రాంతంలో కనిపించారు. పలు అవరోధాల తర్వాత ఆ వ్యక్తి కుక్కను కాపాడి సురక్షితంగా బయటకు తీసుకువచ్చాడు.



## తెలంగాణ రచయితల సంఘం

### ఆహ్వానం

24.12.2022 శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం మొదటి అంతస్తు హాలు, బాగ్ లింగంపల్లి, హైదరాబాదు.

### తెలుగుభాష - ఆధిపత్యాలు

సదస్సు

ఆహ్వానం : కందుకూరి శ్రీరాములు
తెరసం జంట నగరాల శాఖాధ్యక్షులు

అధ్యక్షత : డా. నాళేశ్వరం శంకరం
తెరసం రాష్ట్ర అధ్యక్షులు

ప్రస్తావన : డా. వి. శంకర్
తెరసం రాష్ట్రప్రధాన కార్యదర్శి

ప్రసంగాలు :

1. తెలుగుభాష-సాహిత్య ప్రభావం
ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
ప్రముఖ సాహిత్య విమర్శకులు
2. తెలుగు-వివిధ భాషలు-ఆధిపత్యాలు
డా. నలిమెల భాస్కర్
ప్రముఖ భాషావేత్త
3. తెలుగుభాష-ప్రసార మాధ్యమాలు-ప్రభావాలు
డా. కె. శ్రీనివాస్
సంపాదకులు, ఆంధ్రజ్యోతి
4. భాషాధిపత్యాలు-ఉద్యమాలు-తెలుగు
డా. నందిని సిధారెడ్డి
ప్రముఖ కవి

మీరు తప్పక రావాలని మనవి.

--- తెలంగాణ రచయితల సంఘం

# ఉత్తరప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్‌లో 2022 డిసెంబర్ 18-19 తేదీల్లో రెండురోజుల పాటు జరగనున్న ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ 63వ సమావేశం

న్యూఢిల్లీ, డిసెంబర్ 19:ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ 63వ సమావేశం 2022 డిసెంబర్ 18-19 తేదీల్లో రెండు రోజుల పాటు లక్నోబి- మహానగర్ ఎక్స్‌టెన్షన్ లో ఉన్న ఉత్తరప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్‌లో జరగనున్నది. మొదటి రోజు ప్రారంభ సమావేశం, వ్యాపార సదస్సులు జరుగుతాయి. రెండో రోజు విద్యా సదస్సు జరుగుతుంది. 1600 తర్వాత భారతీయ చరిత్ర యొక్క అసలు మూలాల ఆధారంగా వివిధ అంశాలపై మొత్తం 24 పరిశోధకులు పత్రాలు సమర్పిస్తారు.

ఉత్తరప్రదేశ్ రవాణా మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత)శ్రీ దయా శంకర్ సింగ్ 2022 డిసెంబర్ 22 వ తేదీ ఉదయం 10.30 గంటలకు సమావేశాలు ప్రారంభిస్తారు. నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా సేకరించిన పురాతన మూలాధారాలు ఆధారంగా "స్వాతంత్ర్య పోరాటం- స్వాతంత్ర్య సమరా యుద్ధంలో తెలిసిన మరియు తక్కువ-తెలిసిన పోరాటాలు" పేరుతో రూపొందించిన ప్రదర్శనను మంత్రి ప్రారంభిస్తారు.

ప్రారంభ సమావేశంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ సంస్కృతి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ ముఖేష్ మెష్రామ్ ప్రతినిధులకు స్వాగతం పలుకుతారు. నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ మరియు ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ కార్యదర్శి శ్రీ చందన్ సిన్హా ఆర్కైవ్స్ అభివృద్ధి పై నివేదిక సమర్పిస్తారు. ఈ సందర్భంగా లక్నోలోని ఉత్తరప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్ డైరెక్టర్ మరియు ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ స్థానిక కార్యదర్శి శ్రీమతి ఉమా దివేది వందన సమర్పణ చేస్తారు.

రికార్డుల నిర్వహణ మరియు చారిత్రక పరిశోధన కోసం వాటి ఉపయోగం తో ముడిపడి ఉన్న వివిధ అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందించేందుకు 1919లో ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ (ఎఊఖీఅ) ఏర్పాటు చేయబడింది. రికార్డుల సృష్టికర్తలు, సంరక్షకులు మరియు వినియోగదారుల అఖిల భారత సంస్థగా ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ పనిచేస్తోంది. ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ సచివాలయంగా నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా పనిచేస్తుంది. (1911లో ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీగా మార్చబడింది). కేంద్ర సాంస్కృతిక మంత్రి అధ్యక్షతన ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ పనిచేస్తుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కేంద్ర ప్రభుత్వం నియమించిన ప్రతినిధులు, రాష్ట్ర/కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్కైవ్‌లు, విశ్వవిద్యాలయాలు, గుర్తింపు పొందిన సంస్థలకు చెందిన 134 మంది ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఇంతవరకు ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ సమావేశాలు 62 సార్లు జరిగాయి.

సమావేశాల నిర్వహణ కోసం రెండు కమిటీలు ఏర్పాటు అయ్యాయి. (తి) సమావేశంలో సమర్పించడానికి చరిత్ర మూలాలు ఆధారంగా సిద్ధమైన పరిశోధనా పత్రాలు పరిశీలించడానికి మరియు ఆమోదించడానికి ఎడిటోరియల్ కమిటీ మరియు (తితి) కమిటీ తన సిఫార్సులపై తీసుకున్న చర్యలను సమీక్షించడానికి మరియు దానిని వ్యక్తీకరించడానికి స్టాండింగ్ కమిటీ సమావేశానికి సంబంధించిన ఎజెండాపై అభిప్రాయాలు పరిశీలించడానికి కమిటీలు ఏర్పాటు అయ్యాయి. ఇండియన్ హిస్టారికల్ రికార్డ్స్ కమిటీ నియమించిన స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి వ్యవహరిస్తారు.

# రాష్ట్రంలో మరో కొత్త పథకం..గర్భిణులకు కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్లు



హైదరాబాద్, డిసెంబర్ 19: రాష్ట్రంలో మరో కొత్త పథకం అమలులోకి రానుంది. ఆహారంతోనే ఆరోగ్యం అనే నినాదం ప్రాతిపదికన గర్భిణుల్లో రక్తహీనతకు చెక్‌పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్లను పంపిణీ చేయాలని నిశ్చయించింది. ఈ కొత్త పథకాన్ని అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లాల వైద్యాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఆయా ఆసుపత్రుల్లో కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్లను నిల్వ చేసేందుకు అన్ని జిల్లాల్లోని ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ గదుల కేటాయింపు, నిర్వహణ బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. కలెక్టర్లు ఆసుపత్రులను సందర్శించి కిట్ల నిల్వకు అనువైన గదులను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. కోల్డ్ స్టోరేజీ గదిలో కేసీఆర్ న్యూట్రీషియన్ గదిలో నిల్వ ఉంచి పీహెచ్‌సీల వారీగా గర్భిణులకు పంపిణీ చేయనున్నారు. కిట్ల పంపిణీ వివరాలను వెబ్‌సైట్లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. పీహెచ్‌సీల వారీగా ఎంత మంది గర్భిణులు ఉన్నారు. ఏ రోజు ఎంత మందికి కిట్లను అందజేశారు తదితర వివరాలను వెబ్‌సైట్‌లో ఆశలు, ఏఎన్ఎలు ఉన్నతాధికారులకు సమర్పించాల్సి ఉంటుంది.

రక్తహీనత బారిన పడకుండా కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్లను ఎలా వినియోగించాలో ఆశలు, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి గర్భిణులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. గర్భిణులతోపాటు పుట్టిన శిశువులు ఆరోగ్యంగా ఉండేందుకు కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్లు ఎంతగానో ఉపయోగపడనున్నాయని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. కిట్ల ద్వారా విటమిన్లు, పోషకాలతో కూడిన ఆహారాన్ని గర్భిణీలకు అందిస్తామని, తద్వారా తల్లిబిడ్డలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవంటున్నారు. ఇప్పటికే నసర్కారు దవాఖానాల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడంతోపాటు గర్భిణుల్లో రక్తహీనతను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో వైద్య,ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. మాతా శిశు మరణాలను తగ్గించటంతోపాటు సీజేరియన్ ప్రసవాలను తగ్గించేందుకు ఇప్పటికే కేసీఆర్ కిట్‌తోపాటు నగదు ప్రోత్సాహకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్‌లో అన్ని రకాల విటమిన్లు, పోషకాలతో కూడిన ఆహారం ఉండేలా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గర్భిణుల్లో దాదాపు 60శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. గర్భిణుల్లో రక్తహీనత కారణంగా పుట్టబోయే శిశువుపై ప్రభావం చూపడంతోపాటు బరువు తక్కువగా ఉండడం, ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో జన్మిస్తున్నారు. కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్ ద్వారా ఈ సమస్యను అధిగమించొచ్చని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్‌లో వివిధ ధాన్యాలతో కూడిన పొడి, ఐరన్ సిరప్, ఖర్జూరం, నెయ్యి తదితర పోషక పదార్థాలు ఉండనున్నాయి.

కిట్లను గర్భిణులకు 5వ, 9 నెలల్లో పంపిణీ చేయనున్నారు. అయిదు నెలలకు ఇచ్చే కిట్ విలువ రూ.1962 కాగా, రెండో కిట్ విలువ రూ.1818గా ఉండనుంది. శరీరానికి సరిపడా ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు అందించేందుకు వీలుగా ఈ కిట్లను రూపొందించారు. మొదటి విడతలో కేసీఆర్ న్యూట్రీషిన్ కిట్లను 9 జిల్లాల్లో పంపిణీ చేయనున్నారు. ఆదివాసీ, ఏజెన్సీ ప్రాంతాల్లోని మహిళల్లో ఎక్కువగా రక్తహీనత ఉన్నందున కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్ల పంపిణీ పథకంలో ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ తదితర జిల్లాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

# లేనిపోని రచ్చ చేసి పార్టీ ప్రతిష్ఠను బజారు కీడ్చిన సీనియర్లు !

హైదరాబాద్ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సీనియర్ల పేరుతో తమను తాము గొప్పగా భావించుకునే తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో ఎంత మంది గడిచిన ఎనిమిదిన్నేళ్లుగా నిర్విరామంగా టీఆర్ఎస్ ప్రభుత్వం మీద కొట్లాడింది? మరెంత మంది కేసీఆర్ సర్కారు నిర్ణయాల్ని తప్పు పడుతూ ఉద్యమాలు చేశారు? లాంటి లెక్కలు తీస్తే వారి మాటలకు చేతలకు మధ్యన ఉన్న దూరం ఇట్టే అర్థమవుతుందని చెప్పాలి. పదవుల పేరాశతో పార్టీని నాశనం చేసేలా నిర్ణయాలు తీసుకునే వారిగా సీనియర్లపై విరుచుకుపడుతున్నారు కాంగ్రెస్ వాదులు. పార్టీ మీద అభిమానంతో తాము ఉంటే.. పదవుల పిచ్చి తప్పించి పార్టీ గురించి ఏనాడు ఆలోచించని కాంగ్రెస్ నేతలు ఇవాల్టి రోజున రేవంత్ కువ్యతిరేకంగా జట్టు కడుతున్న తీరును తీవ్రంగా తప్పు పడుతున్నారు. రేవంత్ కు టీపీసీసీ అధ్యక్ష పదవిని కట్టబెట్టానికి ముందు రాష్ట్రంలో పార్టీ పరిస్థితి ఎలా ఉంది? ఇప్పుడెలా ఉందన్న విషయాన్ని కూడా అర్థం చేసుకోలేనితనంతో ఉండటం దేనికి నిదర్శనం? రేవంత్ చేతికి పగ్గాలు లేని ఏడేళ్ల కాలం ఏం చేశారు? ఇప్పుడేదో చేస్తామరి వీరంగం చేయటానికి అంటూ తెలంగాణ కాంగ్రెస్ వాదులు సీనియర్ల మీద విరుచుకుపడుతున్నారు. పదవుల పంచాయితీతో లేనిపోని రచ్చ చేసి పార్టీ ప్రతిష్ఠను బజారున పడేయటం తప్పించి ఇంకేమీ చేయటం వారికి రాదన్న మాట పలువురి నోట వినిపిస్తుండటం గమనార్హం. ఎప్పుడూ ఏదో పొడిచేస్తామన్న మాటే తప్పించి.. పోరాటాలు చేయని సీనియర్లు.. తమ ఏడుపుగొట్టు తీరుతో పార్టీకి ఇంతకాలం చేసిన నష్టం సరిపోదన్నట్లుగా ఇప్పుడు మరిన్ని నాటకాలు మొదలు పెట్టారన్న విమర్శ సగటు తెలంగాణ కాంగ్రెస్ వాదుల నోట వినిపిస్తోంది. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించేసి.. దానికి అవసరమైన కసరత్తు చేస్తున్న వేళ.. టీఆర్ఎస్ ను కాంగ్రెస్ లో విలీనం చేసే అంశంపై అధినాయకత్వం తీవ్రంగా ఆలోచిస్తున్న వేళ. అలాంటి వేళలో ఇప్పుడు చెప్పుకునే సో కాల్డ్ సీనియర్లు పలువురు జన్ పథ్ కు పోటెత్తారు. పార్టీ అధినేత్రి సోనియాగాంధీని కలిశారు. బక్కపల్చటి కేసీఆర్.. ఆయన పార్టీ అవసరం లేదని.. తమకు మించిన తోపులు లేరంటూ అదే పనిగా ఉదరగొట్టేశారు. తెలంగాణ కాంగ్రెస్ కు చెందిన పలువురు నేతలు.. అధినాయకత్వంలో తమ తరఫున పైరవీలు చేసే వారితో మేడమ్ మనసు మార్చే ప్రయత్నం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల మాటలపై సందేహం కలిగిన సోనియా.. ఆ విషయాన్ని ఏం చేయాలన్న దానిపై కాస్తంత కసరత్తు చేసిన సమయంలోనూ లాబీయింగ్ ద్వారా ఆమెను ప్రభావితం చేయటం తెలిసిందే. మొత్తంగా తాము అనుకున్నట్లుగా టీఆర్ఎస్ ను పార్టీ విలీనం కాకుండా అడ్డుకోవటంలో విజయం సాధించారు. అప్పట్లో కేసీఆర్ కు ఇబ్బందికర పరిస్థితి ఉంది. కష్టపడి సంపాదించిన తెలంగాణలో తాను రాజ్యాధికారాన్ని చేపట్టాలే తప్పించి.. తానుపెంచి పెద్ద చేసిన పార్టీని తీసుకెళ్లి కాంగ్రెస్ లో కలిపేయటం కేసీఆర్ కు సుతారం ఇష్టం ఉండేది కాదు. అలా అని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి ఇచ్చిన మాట తప్పే అవకాశం లేదు అప్పట్లో. అలాంటి వేళలో కేసీఆర్ నెత్తిన పాలు పోసింది మరెవరో కాదు.. తమకు మించి తోపులు లేరని చెప్పుకునే ఇప్పటి సీనియర్లే.. అప్పట్లో టీఆర్ఎస్ ను కాంగ్రెస్ లో కలవకుండా అడ్డు పడింది. టీఆర్ఎస్ ను కాంగ్రెస్ లో కలిపేస్తే.. తనకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని సోనియాను కేసీఆర్ అడుగుతారు కాబట్టి.. అలా అడిగితే తమకు సీఎం పదవి ఎక్కడ మిస్ అవుతుందో అన్న పిచ్చి లెక్కలు వేసుకొని ఎవరికి వారు.. కాంగ్రెస్ లో కలిసిపోవాల్సిన గులాబీ పార్టీని ఆపేశారు. చివరకు జరిగిందేమిటో అందరికి తెలిసిందే.

# ఆపరేషన్ తెలంగాణ.. రంగంలోకి మోడీ-షా..



న్యూ డిల్లీ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గుజరాత్ లో గెలిచిన సమరోత్సాహంతో ఉన్న ప్రధాని మోడీ-షాలు ఇప్పుడు దక్షిణాదిలో తమకు గెలుపు అవకాశాలు ఉన్న తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టారు. రెండు సార్లు గెలిచిన వ్యతిరేక టీఆర్ఎస్ పై.. ఇక కాంగ్రెస్ లో అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతుండడంతో ఇదే అదునుగా తెలంగాణను గెలుచుకోవాలని బీజేపీ అధిష్టానం ప్లాన్ రంగం సిద్ధం చేస్తోంది.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా ఏడాది మాత్రమే టైం ఉండడంతో తెలంగాణలో పార్టీ విస్తరణ.. వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం ఫోకస్ చేసింది. ప్రధాని మోడీ-హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే 'ఆపరేషన్ తెలంగాణ' మొదలుపెట్టారు. ఆపరేషన్ ఆకర్ష్ కు పార్టీ తెరతీస్తోంది. కాంగ్రెస్ అసంతృప్త నేతలకు గాలం వేస్తున్నారు.తెలంగాణ బీజేపీ నుంచి మరొకరికి కేంద్ర కేబినెట్ లోకి తీసుకోవాలని నిర్ణయించారు. ఇద్దరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తెలంగాణలో రాజకీయంగా దూకుడుగా వెళ్లాలని నిర్ణయించారు. వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ఓటమే లక్ష్యంగా బీజేపీ హైకమాండ్ పావులు కదుపుతోంది. అందులో భాగంగా పార్టీ బలోపేతం ఇతర పార్టీల నుంచి చేరికలకు నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో నియోజకవర్గాల వారీగా సమాచారం సేకరించింది. కాంగ్రెస్ లో నెలకొన్న పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తోంది. కొందరు కాంగ్రెస్ సీనియర్లను బీజేపీలోకి తీసుకొచ్చే ప్రణాళికను వేగవంతం చేస్తోంది.తాజాగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి డీకే అరుణ లాంటి నేతలు కాంగ్రెస్ నేతలను బీజేపీలోకి రావాలంటూ ఓపెన్ ఆఫర్ లు ప్రకటించారు. స్వయంగా ఆహ్వానిస్తున్నారు. ఇక కేసీఆర్ లక్ష్యంగా ఈటల రాజేందర్ ను రంగంలోకి దించి టీఆర్ఎస్ నేతలను లాగే పనిని అప్పగించారు.వీరంతా కూడా టీఆర్ఎస్ కాంగ్రెస్ టార్గెట్ గా రాష్ట్ర స్థాయిలోనే కాకుండా నియోజకవర్గ స్థాయిలోనూ ఇతర పార్టీల నుంచి వచ్చేవారిని గుర్తించాలని టాస్క్ డిసైడ్ చేశారు. వచ్చే రోజుల్లో బీజేపీలో చేరికలు పెద్దసంఖ్యలో ఉంటాయని చెబుతున్నారు.

# అందాల పోటీలో బంగారు కిరీటాన్ని దక్కించుకున్న ఇండియా

### -21 ఏళ్ల తర్వాత భారత్ కు బ్యూటీ కిరీటాన్ని తెచ్చిన సర్గమ్ కౌశల్

న్యూ డిల్లీ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అందాల పోటీలో కిరీటాన్ని దక్కించుకోవటం మాటలు చెప్పినంత ఈజీ కాదు. దానికి బోలెడన్ని దశలు దాటాలి. కఠిన పరీక్షల్ని ఎదుర్కోవాలి. మానసికంగా ఎంతో బలంగా ఉండాలి. అందానికి అందం మాత్రమే కాదు.. అంతకు మించి అన్నట్లుగా అన్ని ఉండాలి. అప్పుడు మాత్రమే కీర్తి కిరీటం సొంతమవుతుంది. తాజాగా మిసెస్ వరల్డ్ కిరీటాన్ని సొంతం చేసుకుంది భారత్ కు చెందిన సర్గమ్ కౌశల్.ప్రపంచ వ్యాప్తంగా 63 దేశాలకు చెందిన ముద్దుగుమ్మలతో పోటీ పడుతూ.. మిసెస్ వరల్డ్ కిరీటాన్ని సొంతం చేసుకున్నారు ముంబయికి చెందిన ఈ బ్యూటీ. అమెరికాలోని వెస్ట్ గేట్ లాస్ వెగాస్ రిసార్ట్ అండ్ క్యాసినోలో జరిగిన పోటీల్లో ఆమె విజయాన్ని సొంతం చేసుకున్నారు. సర్గమ్ విజేతగా నిలవగా.. మొదటి రన్నరప్ గా మిసెస్ పోలినేసియా.. రెండో రన్నరప్ గా మిసెస్ కెనడా నిలిచారు.ఈ టైటిల్ మరోసారి భారత్ సొంతం కావటానికి ఏకంగా 21 ఏళ్లు పట్టటం విశేషం. 1984 నుంచి నిర్వహిస్తున్న మిసెస్ వరల్డ్ పోటీల్లో తొలిసారి భారత్ అందం మెరిసింది 2001లో. అప్పట్లో మోడల్ అదితి గోవిత్రికర్ మిసెస్ వరల్డ్ టైటిల్ ను సొంతం చేసుకున్నారు.కట్ చేస్తే.. మళ్లీ ఇన్ని రోజుల తర్వాత సర్గమ్ పుణ్యమా అని భారత్ కు ఈ టైటిల్ దక్కింది. ఆమె నివాసం ముంబయి అయినా.. ఆమె కుటుంబానికి జమ్ముకశ్మీర్ కు చెందిన వారుగా చెబుతున్నారు.

# మెదాంతలో చేరిన ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా



న్యూఢిల్లీ, డిసెంబర్ 19: ఎయిమ్స్-ఢిల్లీ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా మెదాంతలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్ ఛైర్మన్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా చేరారు. ఎయిమ్స్‌లో మూడు దశాబ్దాలకు పైగా సేవలందించిన అనంతరం రణ్‌దీప్ గులేరియా స్వచ్ఛంద పదవీవిరమణ తీసుకున్నారు.

ఎయిమ్స్‌లో 2011లో పల్మనరీ మెడిసిన్, స్లీప్ డిజార్డర్స్ కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటయ్యేలా డాక్టర్ రణ్‌దీప్ గులేరియా చొరవ తీసుకున్నారు. 2017ల మార్చి 8న అయిదేండ్ల పదవీ కాలానికి ఆయన ఎయిమ్స్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. వైద్య రంగంలో అపార అనుభవం కలిగిన డాక్టర్ గులేరియా పద్మశ్రీ, డాక్టర్ బీసీ రాయ్ వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు.

డబ్ల్యూహెచ్‌ఓలోని సాంకేతిక నిపుణుల సలహా కమిటీ సభ్యులుగానూ వ్యవహరించిన గులేరియా జామా, ఇండియన్ జర్నల్ ఆఫ్ చెస్ట్ డీసీజెస్, లంగ్ ఇండియా, చెస్ట్ ఇండియా వంటి ప్రముఖ జర్నల్స్‌కు చెందిన ఎడిటోరియల్ బోర్డు సభ్యులుగా పనిచేశారు. డాక్టర్ గులేరియ సిమ్లాలోని ఇందిరాగాంధీ మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసి ఆపై పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్ఛ్ (పీజీఐఎంఈఆర్) చండీఘఢ్ నుంచి జనరల్ మెడిసిన్‌లో ఎండీ, పల్మనరీ మెడిసిన్‌లో పట్టా పొందారు.

# ఎంఎంబి మెడిషైన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించిన మంత్రి



ఖమ్మం, డిసెంబర్ 19:: (నేటినిజం ప్రతినిధి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

ఖమ్మం నగరంలోని బాబురావు పెట్రోల్ బంక్ చెంతన గల డాక్టర్ ప్రమీల హాస్పిటల్ కాంప్లెక్స్ లో నూతన ఎంఎంబి మెడిషైన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ప్రారంభించి మాట్లాడారు.

తెలంగాణ ఉద్యమంలో మీ తండ్రి పోషించిన పాత్ర మరువలేనిదని ఆనాటి ఉద్యమ పటిమ బుడాన్ బేగ్ నాయకత్వ లక్షణాలను మంత్రి గుర్తు చేశారు. ఉద్యమ నాయకుడు, తెరాసా మాజీ అధ్యక్షులు,

దివంగత బుడాన్ బేగ్ తనయుడు డాక్టర్ నియాజ్ ఫర్హత్ వైద్యుడిగా ఎదిగి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే తపనతో దవాఖాన నెలకొల్పడం సంతోషదాయకమని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్, ఏఎంసీ చైర్ పర్సన్ లక్ష్మీప్రసన్న, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, తెరాస కార్పొరేటర్ షౌకత్ అలీ, సిపిఐ సీనియర్ నేతలు ముత్తగూడెం మౌలానా, భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తుది పరీక్షలకు అర్హత సాధించిన 592 మంది అభ్యర్థులు



ఖమ్మం, డిసెంబర్ 19: (నేటినిజం ప్రతినిధి): పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్స్, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా సోమవారం జరిగిన దేహదారుఢ్య పరీక్షలకు 970 మంది హజరైయ్యారని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ తెలిపారు. ఇందులో 592 మంది అభ్యర్థులు తుది పరిక్షలకు అర్హత సాధించారని తెలిపారు. సోమవారం మొత్తం1152 మంది అభ్యర్థులు హజరు కావాల్సివుండగా 970 మంది హజరై ఈవెంట్లలో పాల్గొన్నారని తెలిపారు.

# మెడిసిన్ విద్యార్థికి రాంప్రసాద్ ఆర్థిక సహాయం

- మంత్రి చేతుల మీదుగా చెక్కు అందజేత
- రాంప్రసాద్ ను అభినందించిన మంత్రి



ఖమ్మం, డిసెంబర్ 19:: (నేటినిజం ప్రతినిధి): రెక్కాడితే కానీ డొక్కాడదు ఆ కుటుంబం పరిస్థితి.. అమ్మాయిలు పుట్టారని తండ్రి వారిని చిన్న తనంలోనే వదిలేయడంతో తల్లి కష్టాలను భరిస్తూ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుని చదివించింది. పేదరికంతో కొట్టుమిట్టాడుతూ తమ పిల్లలు ఉన్నత చదువులు చదవాలని తపించింది. చదివే లక్ష్యంగా ఎంచుకుని ప్రస్తుత పరిస్థితితులలోని పోటీ ప్రపంచంలో నెగ్గి ఎంబీబీఎస్ ఎంట్రన్స్ (నీట్)లో సీట్ సాధించి శభాష్ అనిపించుకుంది. ఖమ్మం నగరం గోపాలపురానికి చెందిన విద్యార్థిని సూరారపు పూజిత సీట్ సాధించినప్పటికీ దాతల కోసం చూస్తున్న తరుణంలో తన ప్రతిభను, వారి పేదరికాన్ని గుర్తించి శ్రీ విద్యానికేతన్ స్కూల్ డైరెక్టర్ గొల్లపూడి రాంప్రసాద్ గుర్తించారు.

విద్యార్థినికి అవసరం అయ్యే మొదటి సంవత్సర చదువు ఖర్చుల కోసం అవసరమైన రూ.1.20 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని సోమవారం మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేతుల మీదుగా అందించారు. చదువులో వెనుకడుగు వేయకుండా ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. అతి పేదరికంలో పుట్టి ఆర్థిక స్థితిగతులలో వెనుకబడి ఉన్నా తల్లిదండ్రుల కన్నీటి కష్టాలను దిగమింగుకొని ఎంబీబీఎస్ సీటు సాధించడం గర్వకారణమని మంత్రి పువ్వాడ కొనియాడారు.

మొత్తం 5సంవత్సరాలు విద్య పూర్తి అయ్యేందుకు అయ్యే ఖర్చులు ఎర్పటు చేస్తామని భరోసా కల్పించారు. వైద్యురాలు అయి తల్లి కలను నెరవేర్చి ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. విద్యార్థినికి సహాయం చేసేందుకు ముందుకొచ్చిన గొల్లపూడి రాంప్రసాద్ ను మంత్రి పువ్వాడ అభినందించారు.

కార్యక్రమంలో గొల్లపూడి సతీష్, నాగభూషణం, మోహన్, నర్సింహ, అశోక్, రవి, గోపి, అలీ సాహెబ్, వెంకన్న, శివరామకృష్ణ, శ్రీను తదితరులు ఉన్నారు.

# సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టును సందర్శించిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి): వేములవాడక్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు సోమవారం పట్టణం లోని 'సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ను సందర్శించడం జరిగింది.

కోర్టులో ఎలాంటి సమస్యలు అయినా లాయర్లు చట్టం ప్రకారం ఎలా తీర్పును జడ్జి ద్వారా ఇస్తారు అనే విషయాలను విద్యార్థులకు అవగాహన కలిగించారు. కోర్టు తన కార్యకలాపాలను ఏ విధంగా నిర్వర్తిస్తుందో విద్యార్థులకు కోర్టు సిబ్బంది వివరంగా చెప్పడం జరిగింది. కోర్టు లో ముద్దాయి లను ఎలా ప్రశ్నిస్తారో కూడా పిల్లలకు అవగాహన కలిపించారు..సివిల్ కేసులను, క్రిమినల్ కేసులను ఎలా వాదిస్తాడు అనే విషయాలపై అర్థం చేయుంచారు కేసు లను కోర్టు లో ఎలా ప్రవేశ పెడుతారు. సెక్షన్స్ తో తీర్పు ను ఎలా ఇస్తారు అనే విషయాలను తెలియ చేశారు. విద్యార్థులు కోర్టు గురించి చాలా విషయాలను తెలుసుకున్నందుకు చాలా ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల జడ్జిలు రవీందర్, ప్రతీ క్ సి హగ్, ఏ జి పి గుడిసె సదానందం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల సుధాకర్, జాయింట్ సెక్రెటరీ అవధూత రజినీకాంత్,, న్యాయవాదులు, బెంచి క్లర్కు, పాఠశాల కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ , ప్రధానోపాధ్యాయులు కళ్యాణ్ కుమార్ , ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జేడీఎస్ 93 మంది అభ్యర్థుల పేర్లతో తొలి జాబితా విడుదల

బెంగళూరు డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) : కర్ణాటకలో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగనుంది. మరో ఆరు నెలల్లో కర్ణాటక అసెంబ్లీ గడువు ముగియనుండటంతో ఆ లోగా ఈసీ ఎన్నికలు నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్ తరఫున బరిలో దిగబోయే 93 మంది అభ్యర్థుల పేర్లతో తొలి జాబితాను జేడీఎస్సేనని మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి విడుదల చేశారు.దీనితో ఆ రాష్ట్రంలో అప్పుడే ఎన్నికల వేడి మొదలైంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల వాడి కూడా రెట్టింపయ్యింది.పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కూడా షురూ అయ్యాయి. ముఖ్యంగా అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల నేతలు జోరుగా కామెంట్లు చేస్తున్నారు. ఇద్దరి మధ్య ఈసారి అధికారం చేపట్టబోయేది జేడీఎస్సేనని మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి చెబుతున్నారు. ఈసారి కర్ణాటక ప్రజలు తమకే పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అందుకే, ఇంకా అసెంబ్లీ ఎన్నికల సమయం రాకపోయినా, ఎన్నికల షెడ్యూల్ రావడానికి మరో నాలుగు నెలలు పట్టే అవకాశం ఉన్నా.. కుమారస్వామి మాత్రం అప్పుడే కదనరంగంలో కాలుమోపారు.

# వనపర్తి చరిత్రలో ఇదో సుదినం : మంత్రి నిరంజన్‌రెడ్డి




వనపర్తి డిసెంబర్ 19:వనపర్తి చరిత్రలోనే ఇదో సుదినమని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ఆశీసులతో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలు, రహదారుల విస్తరణ పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జేఎన్టీటీయూ ఇంజినీరింగ్ కళాశాల, వసతిగృహ నిర్మాణానికి భూమిపూజ, ఐటీఐ కళాశాల, మహిళా బీసీ గురుకుల కళాశాల (వ్యవసాయ)కు మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎంపీ పోతుగంటి రాములతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో 1,030 గురుకుల పాఠశాలలు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. గురుకులాలను ఏటా జూనియర్, డిగ్రీ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసుకుంటూ వెళున్నామన్నారు.

సీఎం కేసీఆర్ కేసీఆర్ 16 జిల్లాల్లో ఇటీవల బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే కోర్సులు ఉండాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అని, అందుకే మహిళా బీసీ గురుకుల కళాశాలలో ప్రత్యేకంగా వ్యవసాయ విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఉన్నత విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదన్నది ప్రభుత్వ ఆలోచన అని, భవిష్యత్‌లో వనపర్తి వాసులు ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో ఉండాలన్నది తన ఆకాంక్ష అని మంత్రి అన్నారు. వివిధ విద్యా సంస్థల ఏర్పాటుకు సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రులు సబిత, గంగుల కమలాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రంలో గతవానాకాలం సీజన్‌లో 1.46కోట్ల ఎకరాలకు రైతుబంధు అందించామని, అత్యధిక శాఖ రైతులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకే అందుతుందన్నారు. వనపర్తి వ్యవసాయ కళాశాల కోసం 70 ఎకరాల భూమి అవసరమని, మొదటి దశలో 35 ఎకరాలు అవసరమన్నారు. మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్ తదితర విద్యాసంస్థల కోసం అక్రమార్కుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హన్మంతు, బీసీ గురుకులాల కార్యదర్శి మల్లయ్య భట్టు, రిజిస్ట్రార్ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# త్రిపుర లోని అగర్తలాలో రూ. 4350 కోట్ల విలువైన వివిధ కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన

న్యూఢిల్లీ, డిసెంబర్ 19:త్రిపుర లోని అగర్తలాలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ రూ. 4350 కోట్ల విలువైన వివిధ కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం తో పాటు కొన్నింటిని దేశ ప్రజలకు అంకితం చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన – పట్టణ గ్రామీణ లబ్ధిదారుల కోసం గృహ ప్రవేశ్‌కార్యక్రమం , అగర్తలా బైపాస్ (ఖయేర్పూర్ – అమ్తాలి) ఎన్ హెచ్ –08 విస్తరణ కోసం కనెక్టివిటీ ప్రాజెక్టులు, పిఎంజిఎస్ వై – 3 కింద 230 కిలోమీటర్లకు పైగా పొడవైన 32 రహదారులకు శంకుస్థాపనలు, 540 కిలోమీటర్లకు మేర 112 రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులు ఈ ప్రాజెక్టులలో ఉన్నాయి. ఆనంద్ నగర్ లో స్టేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ ను, అగర్త ల ప్రభుత్వ దంత వైద్య కళాశాలను ప్రధాన మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, కార్యక్రమం ప్రారంభం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నందుకు హాజరైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మేఘాలయలో అనేక ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కారణంగా తాము రావడం స్వల్ప ఆలస్యం అయినందుకు క్షమాపణలు చెప్పారు.

గత ఐదు సంవత్స రాలుగా పరిశుభ్రత కార్యక్రమాలకు సంబంధించి రాష్ట్రంలో చేపట్టిన ప్రశంసనీయమైన కార్యక్రమాల ను ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, త్రిపురప్రజలు పరిశుభ్రత ను ఒక ప్రజా ఉద్యమంగా మార్చారని కొనియాడారు.

ఫలితంగా, ప్రాంతాల వారీగా చిన్న రాష్ట్రాల విషయానికి వస్తే భారతదేశంలోనే అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రంగా త్రిపుర నిలిచిందని, త్రిపుర సుందరి మాతఆశీస్సులతో త్రిపుర అభివృద్ధి ప్రయాణం కొత్త శిఖరాలకు చేరుకుందని ఆయన అన్నారు.

అనుసంధానం, నైపుణ్యాల అభివృద్ధి, పేదల ఇంటికి సంబంధించి నేడు ప్రారంభమైన పథకాలకు గానూ త్రిపురప్రజలను ప్రధాన మంత్రి అభినందించారు. త్రిపురలో తొలి దంత వైద్య కళాశాల అందుబాటులోకి వ స్తోంది" అని ప్రధాన మంత్రి అన్నారు. త్రిపుర యువతకు రాష్ట్రం విడిచి వెళ్లాల్సిన అవసరం లేకుండా డాక్టర్లు కావడానికి అవకాశం లభించ గలదనిప్రధాన మంత్రి అన్నారు. నేడు రాష్ట్రానికి చెందిన రెండు లక్షల మందికి పైగా పేదలు తమ కొత్త పక్కా ఇళ్లలో గృహ ప్రవేశం చేస్తున్నారని, ఈ ఇళ్ల యజమానులు మన తల్లులు, సోదరీమణులు అని ఆయన తెలిపారు.

మొట్ట మొదటిసారిగా గృహ యజమానులు కాబోతున్న మహిళలకు ప్రధాన మంత్రి అభినందనలు తెలిపారు. "పేదలకు ఇళ్ళు నిర్మించడంలో త్రిపుర ప్రముఖ రాష్ట్రంగా ఉంది" అని అంటూ శ్రీ మాణిక్ సాహా ఆయన బృందం చేసిన కృషిని ప్రధానమంత్రి ప్రశంసించారు.

వేదిక వద్దకు వెళ్లే సమయంలో వేలాది మంది మద్దతుదారుల నుంచి తనకు లభించిన ఆత్మీయ స్వాగతం గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

త్రిపురతో సహా అన్ని ఈశాన్య రాష్ట్రాల భవిష్యత్తు అభివృద్ధికి సంబంధించిన రోడ్ మ్యాప్ పై జరిగిన చర్చలపై ప్రధాని ఈ రోజు ఉదయం తాము షిల్లాంగ్ లో హాజరైన నార్త్ ఈస్టర్న్ కౌన్సిల్ సమావేశం గురించి ప్రస్తావించారు. ' అష్ట లక్ష్మి' లేదా ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి 'అష్ట ఆధార్' లేదా ఎనిమిది కీలక అంశాలను గురించి ఆయన వివరించారు. త్రిపుర లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం గురించి ప్రధాన మంత్రిప్రస్తావిస్తూ, రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు నిరంతరం ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాక ముందు ఈశాన్య రాష్ట్రాల గురించి ఎన్నికల సమయంలోనూ, హింసాత్మక ఘటనలు జరిగిన సమయంలో మాత్రమే మాట్లాడుకునేవారని ప్రధాన మంత్రి గుర్తు చేశారు. త్రిపురలో ఈ నాడు పరిశుభ్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పేదలకు ఇళ్ల నిర్మాణంపై చర్చ జరుగుతోందని ఆయన అన్నారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, క్షేత్రస్థాయిలో ఫలితాలను చూపించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దీనిని సాధ్యం చేస్తోందని ఆయన అన్నారు. "గత ఐదేళ్లలో త్రిపురలోని అనేక గ్రామాలకు రహదారి కనెక్టివిటీ లభించిందని, త్రిపురలోని అన్ని గ్రామాలను రహదారుల ద్వారా అనుసంధానించడానికి ఇప్పటికే వేగవంతమైన పనులు జరుగుతున్నాయని" ఆయన చెప్పారు.

ఈ రోజు పునాది రాయి వేసిన పథకాల ద్వారా రాష్ట్ర రహదారుల నెట్ వర్క్ ను మరింత బలోపేతం కాగలదని, రాజ ధానిలో ట్రాఫిక్ ను సులభతరం చేయగలదని, జీవితాలను సులభతరం చేస్తుందని ప్రధాన మంత్రి అన్నారు.

అగర్తలా–అఖౌరా రైలు మార్గం, ఇండియా–థాయ్ లాండ్–మయన్మార్ హైవే మౌలిక సదుపాయాలతో తెరుచుకోబోయే కొత్త మార్గాల గురించి తెలియజేస్తూ, త్రిపుర మీదుగా ఈశాన్య ప్రాంతం అంతర్జాతీయ వాణిజ్యానికి ఒక ప్రవేశ ద్వారంగా మారుతోంది" అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. అగర్తలాలోని మహారాజా బీర్ బిక్రమ్ విమానాశ్రయంలో అంతర్జాతీయ టెర్మినల్ నిర్మాణంతో కనెక్టివిటీ ఊపందుకుందని ఆయన అన్నారు. తత్ఫలితంగా, త్రిపుర ఈశాన్యంలో ఒక ముఖ్యమైన లాజిస్టిక్స్ హబ్ గా అభివృద్ధి చెందుతోంది. త్రిపుర లో నేటి యువతకు ఇంటర్నెట్ అనుసంధానాన్ని అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రధాన మంత్రి వివరించారు. త్రిపురలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వ కృషి వల్లే ఇప్పుడు అనేక పంచాయతీలు ఆప్టికల్ ఫైబర్ తో అనుసంధానమయ్యాయని ఆయన అన్నారు.

సామాజిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి రెండు ఇంజిన్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఈశాన్య రాష్ట్రాల గ్రామాల లో ఏడు వేలకు పైగా ఆరోగ్య , స్వస్థత కేంద్రాలకు ఆమోదం లభించిందని ప్రధాన మంత్రి చెప్పారు."త్రిపురలో ఇలాంటి వెయ్యి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. అదేవిధంగా ఆయుష్మాన్ భారత్–పీఎం జయ్ పథకం కింద త్రిపురలోని వేలాది మంది పేద ప్రజలకు రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్స సౌకర్యం లభించిందని" తెలిపారు."మరుగుదొడ్లు, విద్యుత్ లేదా గ్యాస్ కనెక్షన్లు ఇలా అన్ని రకాల పనులు చేయడం ఇదే తొలిసారి" అని శ్రీ మోదీ చెప్పారు. చౌక ధరలకు పైప్ గ్యాస్ ను తీసుకురావడానికి, ప్రతి ఇంటికి పైపుల ద్వారా నీటిని అందించడానికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందని ఆయన అన్నారు. త్రిపుర లోని నాలుగు లక్షల కొత్త కుటుంబాలు కేవలం మూడు సంవత్సరాలలో కుళాయిల ద్వారా నీటి సదుపాయాలను పొందాయని ప్రధాన మంత్రి వివరించారు.

త్రిపుర లో లక్ష మందికి పైగా గర్భిణులకు లబ్ది చేకూర్చిన ప్రధాన మంత్రి మాతృ వందన యోజన కింద పౌష్టికాహారం కోసం ప్రతి తల్లి బ్యాంకు ఖాతాలోకి నేరుగా వేలాది రూపాయలు జమ అయ్యాయని ప్రధాన మంత్రి వివరించారు. తత్ఫలితంగా, ఈ రోజు ఆసుపత్రులలో ఎక్కువ ప్రసవాలు జరుగుతున్నాయని, తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడుతున్నారని ఆయన అన్నారు.

మన తల్లులు,సోదరీమణులకు ఆత్మనిర్భ ర భారత్ (స్వావలంబన ) గురించి ప్రధాన మంత్రి ప్ర స్తావిస్తూ, మహిళల ఉపాధి కోసం ప్రభుత్వం వందల కోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీని విడుదల చేసిందని తెలిపారు. త్రిపురలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చాక మహిళా స్వయం సహాయక సంఘాల సంఖ్య తొమ్మిది రెట్లు పెరిగిందని ఆయన ప్రశంసించారు.

"దశాబ్దాలుగా త్రిపురను భావజాలం ప్రాముఖ్యతను కోల్పోయి అవకాశవాద రాజకీయాలు చేసే పార్టీలు పాలించాయి. ఫలితంగా త్రిపుర అభివృద్ధికి దూరమైంది"అని ప్రధాన మంత్రి అన్నారు. పేదలు, యువత, రైతులు, మహిళలు ఎక్కువగా దీని బారిన పడ్డారని ఆయన అన్నారు. ఈ రకమైన భావజాలం, ఈ రకమైన మనస్తత్వం ప్రజలకు ప్రయోజనం చేకూర్చదని ఎర్కొన్నారు. "వారికి ప్రతికూలతను ఎలా వ్యాప్తి చేయాలో మాత్రమే తెలుసు వారికి ఎటువంటి సానుకూల ఎజెండా లేదు " అని ఆయన అన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం సంకల్పాన్ని కలిగి ఉందని, అలాగే సాధించడానికి సానుకూల మార్గాన్ని కలిగి ఉందని ఆయన అన్నారు.

అధికార రాజకీయాల వల్ల మన గిరిజన సమాజాలకు కలిగే గొప్ప నష్టాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, గిరిజన సమాజం ,గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు.

"బిజెపి ఈ రాజకీయాలను మార్చింది, అందుకే అది గిరిజన సమాజం మొదటి ఎంపికగా మారింది" అని అన్నారు. ఇటీవల గుజరాత్ ఎన్నికలను గుర్తు చేసుకున్న ప్రధాన మంత్రి, 27 సంవత్సరాల తరువాత కూడా బిజెపి భారీ విజయానికి గిరిజన సమాజం అందించిన సహకారాన్ని ప్రశంసించారు.

గిరిజనులకు రిజర్వ్ చేసిన 27సీట్లలో 24 స్థానాలను బిజెపి గెలుచుకుందని ఆయన చెప్పారు.

ఆదివాసి సముదాయాల అభ్యున్నతి కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, ఆదివాసుల కు ప్రత్యేక మంత్రిత్వ శాఖను, ప్రత్యేకబడ్జెట్ ను ఏర్పాటు చేసినది అటల్ జీప్రభుత్వం అని గుర్తు చేశారు. గిరిజనుల కోసం రూ.21 వేల కోట్లుగా ఉన్న బడ్జెట్ నేడు రూ.88 వేల కోట్లకు చేరుకుందని చెప్పారు. గిరిజన విద్యార్థుల ఉపకార వేతనాలు కూడా రెట్టింపు అయ్యాయని ప్రధాన మంత్రి తెలియజేశారు."2014కు ముందు గిరిజన ప్రాంతాల్లో 100 కంటే తక్కువ ఏకలవ్య మోడల్ స్కూళ్లు ఉండేవి. ఈ నాడు ఆ సంఖ్య 500 కి పైగా ఉంది. త్రిపుర లో కూడా ఇలాంటి 20 కి పైగా స్కూళ్ల కు ఆమోదం లభించింది" అని ప్రధాన మంత్రి వివరించారు.

గత ప్రభుత్వాలు 8–10 అటవీ ఉత్పత్తులకు మాత్రమే ఎం ఎస్ పి ఎంఎస్పి ఇచ్చేవని, బిజెపి ప్రభుత్వం 90 అటవీ ఉత్పత్తులకు ఎం ఎస్ పి ఇస్తోందని ఆయన చెప్పారు. ప్రస్తుతం గిరిజన ప్రాంతాల్లో 50,000కు పైగా వాన్ ధన్ కేంద్రాలు ఉన్నాయని, ఇవి సుమారు తొమ్మిది లక్షల మంది గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్నాయని, వారిలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారని ఆయన అన్నారు.

గిరిజనుల ఆత్మ గౌరవాన్నిబిజెపి ప్రభుత్వం అర్థం చేసుకుందని, అందుకే బిర్సా ముండా జన్మదినాన్ని నవంబర్ 15 న దేశవ్యాప్తంగా జన్ జాతీయ గౌరవ్ దివస్ గా జరుపుకోవడం ప్రారంభించిందని ప్రధాన మంత్రి అన్నారు. దేశ వ్యాప్తంగా 10 గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియాలు ఏర్పాటు అవుతున్నాయని, త్రిపురలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల మహారాజా బీరేంద్ర కిశోర్ మాణిక్య మ్యూజియం , కల్చరల్ సెంటర్ కు పునాదిరాయి వేశారని చెప్పారు. త్రిపుర ప్రభుత్వం కూడా గిరిజన సహకారం ,సంస్కృతిని ప్రోత్సహించడానికి నిరంతర ప్రయత్నాలు చేస్తోందని, త్రిపుర గిరిజన కళ, సంస్కృతిని ముందుకు తీసుకువెళ్ళిన వ్యక్తులకు పద్మ సమ్మాన్ ఇస్తుందని చెప్పారు.

త్రిపుర లోని చిన్న రైతులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మెరుగైన అవకాశాలను కల్పించడం కోసం డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. "ఇక్కడ స్థానికతను ప్రపంచవ్యాప్తం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి" అన్నారు. త్రిపుర నుండి పైనాపిల్ విదేశాలక చేరుకోవడాన్ని శ్రీ మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. "అంతే కాదు, ఇక్కడ నుండి వందలాది మెట్రిక్ టన్నుల ఇతర పండ్లు, కూరగాయలు బంగ్లాదేశ్, జర్మనీ, దుబాయ్లకు ఎగుమతి చేయబడ్డాయి, ఫలితంగా రైతులు తమ ఉత్పత్తులకు అధిక ధరలను పొందుతున్నారు" అని చెప్పారు. త్రిపురకు చెందిన లక్షలాది మంది రైతులు ఇప్పటివరకు పిఎం కిసాన్ సమ్మాన్ నిధి నుండి రూ .500 కోట్లకు పైగా పొందారని ఆయన అన్నారు. త్రిపుర లోని అగర్–కలప పరిశ్రమను కూడా ఆయన ప్రస్తావించారు. ఇది త్రిపుర యువతకు కొత్త అవకాశాలు , ఆదాయ వనరుగా మారుతుందని అన్నారు.

ప్రసంగాన్ని ముగిస్తూ ప్రధాన మంత్రి, త్రిపుర ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి ద్వంద్వ చోదక శక్తి ఆవిర్భవించడంతో శాంతి, అభివృద్ధి పథంలోపయనిస్తోందని పేర్కొన్నారు. 'త్రిపుర ప్రజల సామర్థ్యంపై నాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ విశ్వాసంతో మేము అభివృద్ధి ప్రక్రియ ను మరింత వేగవంతం చేస్తాము, మీ అందరికీ అనేక అభినందనలు" అని అన్నారు.

త్రిపుర ముఖ్యమంత్రి ప్రొఫెసర్ (డాక్టర్) మాణిక్ సాహా, త్రిపుర గవర్నర్ శ్రీ సత్యదేవ్ నారాయణ్ ఆర్య, త్రిపుర ఉపముఖ్యమంత్రి శ్రీ జిష్ణు దేవ్ వర్మ ,కేంద్ర సహాయ మంత్రి ప్రతిమా భూమిక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండేలా చూడడంపై ప్రధాన మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ప్రాంతంలో దీనిని నిర్ధారించడానికి ఒక కీలకమైన చర్యగా, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన – పట్టణ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ లబ్ధిదారుల కోసం గృహ ప్రవేశ్ కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి ప్రారంభించారు. 3400 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసిన ఈ గృహాల ను రెండు లక్షల మందికి పైగా లబ్ధిదారులకు కేటాయించారు.

రహదారి అనుసంధానాన్ని మెరుగు పరచడంపై దృష్టి సారించిన ప్రధాన మంత్రి అగర్తలా నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు తోడ్పడే అగర్తలా బైపాస్ (ఖైర్ పూర్ – అమ్తాలి) ఎన్ హెచ్–08 ను వెడల్పు చేసే ప్రాజెక్టును ప్రారంభించారు.

ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన (పిఎమ్ జిఎస్ వై 3) కింద 230 కిలోమీటర్లకు పైగా పొడవున 32 రహదారులకు, 540 కిలోమీటర్లకు పైగా ఉన్న 112 రోడ్ల అభివృద్ధికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆనంద్ నగర్ లో స్టేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ ను, అగర్తల ప్రభుత్వ దంత వైద్య కళాశాలను ప్ర ధాన మంత్రి ప్రారంభించారు.

# ఏరియా ఆసుపత్రి లో 20 లక్షలతో ఏర్పాటు చేసిన ఎక్స రే సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రమేష్



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ తిప్పాపూర్ ఏరియా ఆస్పత్రిలో 20 లక్షలతో ఏర్పాటుచేసిన ఎక్స్ రే సెంటర్ ను ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు ప్రారంభించారు.అనంతరం ఆసుపత్రి సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ సహకారంతో కరోనా కష్ట కాలంలో అద్భుతమైన సేవలు అందించి అంచెలంచెలుగా వృద్ధి చెందుతూ ప్రజలకు మంచి సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది కి ధన్యవాదాలు తెలిపారు. ఇంకా

వచ్చే 6 మాసాల్లో అత్యవసర సౌకర్యాలు అవసరమో జిల్లా మంత్రి కేటీఆర్ అనుమతితో మంజూరు చేసుకుందాం అని, అలాగే డయాలసిస్ సెంటర్ ను మన 100 పడకల ఆసుపత్రిలో అవసరం అని మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేసుకుందాం అని అన్నారు.

వేములవాడ నియోజకవర్గం తో పాటు సిరిసిల్ల, కరీంనగర్ నుండి వచ్చి మరి వేద్యం చేసుకుంటున్నారని, తెలంగాణ రాష్ట్రం లోనే మోకాళ్ల ఆపరేషన్ చేసిన ఘనత మన ఏరియా ఆసుపత్రికే దక్కుతుందని ప్రతిరోజు 190 మంది ఔట్ పేషెంట్లు వైద్యం చేయించుకుంటున్నారని మంచి వేద్యం అందిస్తున్న ఆసుపత్రి సూపరింటెంట్ మహేష్ వైద్య సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి , మున్సిపల్ వైస్ చైర్మన్ మధు రాజేందర్ , కథలాపూర్ జెడ్.పి.టి.సి నాగం భూమయ్య , వేములవాడ అర్బన్ జెడ్.పి.టి.సి మ్యాకల రవి , వేములవాడ ఆర్.డి.ఓ పవన్ కుమార్ , మున్సిపల్ కమిషనర్ అవినాష్ , వైద్య సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాములకు ప్రభుత్వం తరపున పూజ భిక్ష అల్పార విందు ఏర్పాటు చేయాలి

-శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్



హైదరాబాద్ డిసెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ వెంటనే అయ్యప్ప స్వాములకు ఉచిత శబరిమలై ప్రయాణము మరియు లాల్ బహదూర్ స్టేడియం లో అయ్యప్ప స్వాములకు ముఖ్యమంత్రి గారి ఆధ్వర్యంలో అయ్యప్ప పూజ భిక్ష మరియు అల్పార విందు తెలంగాణ ప్రభుత్వ ప్రకారం గా నిర్వహించాలని శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్ డిమాండ్ చేసారు.క్రిస్టియన్లకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు,ముస్లింలకు ఇఫ్తార్ విందు లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహిస్తారు వారిలాగే అయ్యప్ప స్వాములకు కూడా లాల్ బహదూర్ స్టేడియం లో అయ్యప్ప పూజ బిక్ష మరియు అల్పారా విందు నిర్వహించాలని కోరారు. ఈ రోజు కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి అయ్యప్ప స్వాములు శబరిమలైకు బయలుదేరారు స్వాములకు పండ్లు పలహారాలు ఇచ్చి అయ్యప్ప స్వాముల ఆశీర్వాదం తీసుకున్నారు. అయ్యప్ప స్వాములు రమేష్ స్వామి సాయి స్వామి బానోత్ సక్రుస్వామి గోపాల్ స్వామి విజయ్ స్వామి నరేష్ స్వామి మల్లేష్ స్వామి వేరిష్ స్వామి శ్రీధర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.మంగీలాల్ స్వామి శంకర్ స్వామి గణేష్ స్వామి సంతోష స్వామి ప్రసాద్ స్వామి రాంబాబు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మసి కర్బనం

న్యూఢిల్లీ, డిసెంబర్ 19:హిమాలయ హిమానీనదాల అధ్యయనం అనేది భారతదేశంలో మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తల పరిశోధనలు, డేటా సేకరణ మరియు వివిధ పరిశోధన అధ్యయనాల విశ్లేషణల ద్వారా అధ్యయనం చేయబడుతున్న సంక్లిష్టమైన మరియు అభివృద్ధి చెందుతున్న విషయం. హిమానీనదాలు మరియు వాటి లక్షణాలు హిమాలయాలలోని వివిధ ఉప ప్రాంతాలలో నిర్దిష్ట ప్రదేశాలలో సంక్లిష్టమైన మార్పులను ప్రదర్శిస్తాయి.

హిమాలయాల్లో స్థిరమైన, తిరోగమనం లేదా పురోగమిస్తున్న హిమానీనదాలు ఉన్నాయి, తద్వారా హిమానీనదాలు పరిణామ గతిశీలత యొక్క సంక్లిష్ట భౌగోళిక మరియు చక్రీయ స్వభావాన్ని నొక్కి చెబుతుంది. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ఇస్రో జియోస్పియర్ బయోస్పియర్ ప్రోగ్రామ్ (భూగోళంపై ఉన్న భూతలము జీవావరణం అధ్యయనం) కింద ఏరోసోల్ అబ్జర్వేటరీల నెట్‌వర్క్ (వాయువులో ఉండే ద్రవ లేదా ఘన కణాలును అధ్యయనం చేసే పరిశోధనా కేంద్రాలు నెట్వర్క్) ను నిర్వహిస్తోంది.

ఈ నెట్‌వర్క్ నుండి కొలవబడే పారామితులలో ఒకటి మసి కర్బనం ద్రవ్యరాశి ఏకాగ్రత. ఏరోసోల్ అబ్జర్వేటరీల యొక్క పైన పేర్కొన్న ప్రాంతీయ నెట్‌వర్క్ నుండి భారతీయ ప్రాంతంపై మసి కర్బనం (బ్లాక్ కార్బన్) యొక్క దీర్ఘకాలిక సూచికలు గత దశాబ్దంలో తగ్గుతున్న ధోరణిని (0.24 'ఇ ఎ-3ఎవజీతీ-1) స్పష్టంగా చూపుతున్నాయి.

మసి కర్బనం ఉద్గారాలను నియంత్రించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది, వీటిలో ఈ క్రిందివి ఉన్నాయి:

ప్రధాన మంత్రి ఉజ్వల యోజన శుభ్రమైన గృహ వంట ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది.

ఏప్రిల్ 1, 2020 నుండి ఇంధనం మరియు వాహనాల కోసం బీఎస్–ఎం నుండి బీ ఎస్ –ఎ నిబంధనలకు ముందడుగు.

ప్రజా రవాణా కోసం మెట్రో రైళ్ల నెట్‌వర్క్ మెరుగుపరచబడింది మరియు మరిన్ని నగరాలు కు విస్తరించబడ్డాయి.

వాయు ఇంధనం (సీ ఎన్ జీ, ఎల్ పి జి మొదలైనవి), ఇథనాల్ మిశ్రమం వంటి క్లీనర్ / ప్రత్యామ్నాయ ఇంధనాల పరిచయం.

5000 కంప్రెస్డ్ బయో–గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్‌లను ఏర్పాటు చేయడానికి మరియు సీ బీ జీ ని ఉపయోగించడానికి మార్కెట్‌లో అందుబాటులో ఉంచడానికి "సస్టైనబుల్ ఆల్టర్నేటివ్ టువర్డ్స్ అఫర్డబుల్ ట్రాన్స్‌పోర్టేషన్ అనే కొత్త చొరవ ప్రారంభించబడింది.

'పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ మరియు ఢిల్లీలోని ఎన్ సీ టీ రాష్ట్రాల్లో పంట అవశేషాల నిర్వహణ కోసం వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడం'పై సెంట్రల్ సెక్టార్ స్కీమ్ కింద, వ్యవసాయ యంత్రాలు మరియు ఇ పంట అవశేషాల నిర్వహణ కోసం పరికరాలు 50% తో ప్రోత్సహించబడ్డాయి. రైతులకు సబ్సిడీ మరియు కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుకు 80% సబ్సిడీ.

2025 – 26 నాటికి వాయు కాలుష్యము లో ధూళి (పర్టిక్యులేట్ మ్యాటర్) సాంద్రతలలో 40% తగ్గింపును సాధించాలనే లక్ష్యాలతో దేశవ్యాప్తంగా వాయు కాలుష్య సమస్యను సమగ్ర పద్ధతిలో పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌ను దీర్ఘకాలిక, కాలపరిమితి, జాతీయ స్థాయి వ్యూహంగా అమలు చేస్తోంది.

